
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

శనివారం 12 జూలై 2025



'పోగు'బంధం తెంచుకుని..

నూలును పోగు, పోగు పెనవేసి దుస్తులు నేసి మన సంస్కృతికి, సంస్కారానికి నిలువుటద్దంగా నిలిచే చేనేత కార్మికులు పేగుల ఆకలి తీర్చేందుకు ఆ 'పోగు' బంధాన్ని వదులుకుంటున్నారు. మగ్గాలే జీవితంగా.. వస్త్రాలే సర్వస్వంగా తరతరాల నుంచి జీవిస్తున్న వారు, బతుకు బండిని లాగేందుకు వేరే దారి వెతుక్కుంటున్నారు. కుల వృత్తిని నమ్ముకుని గౌరవంగా బతికిన నేతన్నలు కన్నబిడ్డలను సాకేందుకు కూలీలుగా మారుతున్నారు. ఎన్నేళ్లు నేసినా ఎదుగు బొదుగు లేక, మనసు చంపుకుని మగ్గం గుంటలు వదిలి వలస పోతున్నారు. నానాటికి పెరుగుతున్న ధరల తాకిడిని తట్టుకోలేక, అలాగని మరో పని చేయలేక కొందరు నేత వృత్తిలోనే నలిగిపోతున్నారు.

8 లో..

ఉదయగిరిలో

దారుణ హత్య

ఆస్తి వివాదాలే కారణం



- వివరాలు 6లో..

సంగం ఐటీఐ..

లగడపాటి రామా నాయుడు ఐటీఐగా పేరు మార్పు

- వివరాలు 8లో..



శాకంబరి అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

శాకంబరిగా రాజరాజేశ్వరి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం శాకంబరి అలంకరణ జరిగింది. మూలవర్లు, ఉత్సవమూర్తులు, ప్రాకార దేవతలు, గర్భాలయం, అనివెట్టి మండపాన్ని కూరగాయలు, పండ్లతో అలంకరించారు. అనివెట్టి మండపంలో రాజరాజేశ్వరి అమ్మవారికి కాళికాదేవి అలంకారం భక్తులకు కనువిందు చేసింది. కలేపండ్లు, చుక్కుడు గింజలు, బెంగళూరు మిర్చితో రూపొందించిన ఈ అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ రకాల పండ్లు, కూరగాయలను తొలచి మలిచిన రూపాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సామూహిక లలితా సహస్ర నామ పారాయణం జరిగింది. రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుతూ 18 సంవత్సరాలుగా ఏటా ఆషాడ మాసంలో కొలపర్తి వెంకట రమేష్‌కుమార్, సువర్ణలక్ష్మి దంపతులు ఈ అలంకరణ చేయిస్తున్నారు. ఈ ఏడాది అలంకారాన్ని రూరల్ ఎమ్మెల్యే సతీమణి కోటంరెడ్డి సుజితమ్మ ప్రారంభించారు. ఈవో జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

● వాసవీదేవికి గోరింట శోభ

నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారికి 350 కిలోల గోరింటాకుతో విశేష అలంకారం జరిగింది. సామూహిక లలితా సహస్రనామ పారాయణం, అన్నదానం జరిగాయి. సాయంత్రం విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని దర్శించుకున్న మహిళా భక్తుల చేతులకు ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో ఉచితంగా గోరింటాకు డిజైన్లు వేయించారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు షేగు షణ్ముఖరావు, కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌రావు, గౌరవ సలహాదారు ఎంపీ ఆంజనేయులు తదితరులు పర్యవేక్షించారు.



కన్యకాపరమేశ్వరి ఆలయంలో గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు

రెవెన్యూ వ్యవస్థ

దేశానికే తలమానికం!

జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్ ● ఉత్సాహంగా రెవెన్యూ క్రీడల ప్రారంభం



నెల్లూరు (హరనాథపురం), జూలై 11 : దేశానికి రెవెన్యూ వ్యవస్థ తలమానికమని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఏసీ స్టేడియంలో ఏపీఆర్ఎస్ఏ ఆధ్వర్యంలో రెవెన్యూ క్రీడోత్సవాలను కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దేశానికి తలసరి ఆదాయాన్ని చేకూర్చే శాఖ రెవెన్యూ అంటూ ఆ శాఖ గొప్పదనాన్ని వివరించారు. అంతేగాక ప్రజలకు దగ్గరగా పనిచేసేది రెవెన్యూ ఉద్యోగులేనని, వారి కోసం ప్రత్యేకంగా క్రీడోత్సవాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో న్యాయశాఖలోని ఉద్యోగుల కోసం కూడా క్రీడలను నిర్వహించేందుకు ఆలోచన చేస్తామని చెప్పారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రెవెన్యూ క్రీడలను ఉద్యోగులు స్ఫూర్తిగా తీసుకుని, తమ జీవితంలో ఒక భాగంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్, కలెక్టర్ ఆనంద్

● వాలీబాల్ ఆడిన కలెక్టర్, జేసీ

రెవెన్యూ క్రీడలలో భాగంగా కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్‌లు వాలీబాల్ పోటీలను ప్రారంభించి కాసేపు సరదాగా ఆడారు. ఈ కార్యక్రమాల్లో కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో హుస్సేన్ సాహెబ్, కలెక్టరేట్ ఏఓ విజయకుమార్, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పరుగు పందెం పోటీలను వారు ప్రారంభించారు. లెమన్‌స్పూన్, టగ్‌వార్, చెస్, క్యారంబోర్డు, త్రోబాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ తదితర క్రీడాంశాలపై రెవెన్యూ ఉద్యోగులకు పోటీలు జరిగాయి.



వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్..

17న బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభ 8



ఎరువుల గోదాములో తనిఖీ చేస్తున్న ఏఓ జహీర్

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలిగిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'యూరియా ఏదయ్యా' అనే శీర్షికన ఓ కథనం ప్రచురితమైంది. దీంతో వ్యవసాయ అధికారులు కలిగిరి మండలంలోని - మిగతా 7వ పేజీలో



నగరంలోని ఆర్టీసీ కార్గోలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

గుడ్లూరు మద్యం..

గుట్టు తేలుద్దాం!

జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్ అధికారుల విస్తృత తనిఖీలు

ఆర్టీసీ కార్గో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో ఆరా

నెల్లూరు (క్రైం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం.. ఈ పేరు వింటే చాలు మందుబాబుల్లో వణుకు మొదలవుతుంది. గతంలో ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు పంపిణీ చేసిన అక్రమ మద్యం తాగి పలువురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. అయితే జిల్లాలో ఈ నెల 5వ తేదీన గుడ్లూరు ప్రాంతంలో నకిలీ మద్యం తయారు చేసే ఓ ముఠాను ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి స్పిరిట్‌ను తీసుకు వచ్చి మద్యం తయారు చేసి సీసాల్లో నింపి తక్కువ ధరకే బెల్ట్‌షాపులకు విక్రయిస్తున్నారు. అయితే, ఈ నకిలీ మద్యం గుడ్లూరు ప్రాంతానికే పరిమితం అయ్యిందా!? లేదా జిల్లావ్యాప్తంగా వ్యాపించిందా!? అనే కోణంలో ఎక్సైజ్ పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు.

● గుడ్లూరులో నకిలీ మద్యం

మండల కేంద్రమైన గుడ్లూరు గ్రంథాలయం వీధిలో ఉంటున్న ఉప్పలపాటి వీరాంజనేయులురాజుతోపాటు మరికొందరు నకిలీ మద్యం తయారు చేసి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని బెల్ట్‌షాపులకు తరలిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు అక్రమ మద్యం విక్రయాలపై విచారిస్తుండగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సూత్రధారి అయిన వీరాంజనేయులురాజు నెల్లూరులో కూరగాయల దుకాణం - మిగతా 7వ పేజీలో

రేషన్ మాఫియాకు చెక్ పడేనా!?

జిల్లాలో ప్రతినెలా 2 వేల టన్నుల బియ్యం పక్కదారి

- గుడిపల్లిపాడు కేంద్రంగా మాఫియా అక్రమాలు
- రీసైక్లింగ్ చేసి మార్కెట్లోకి విడుదల
- రూ.15లకు కొనడం.. రూ.60కి అమ్మడం
- రాష్ట్ర ప్రభుత్వానికి నిఘా వర్గాల నివేదిక
- పౌరసరఫరాల శాఖ అధికారులతో మంత్రి నాదెండ్ల సమీక్ష
- బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు
- పోర్టు ప్రాంతంలో 24 గంటల చెక్‌పోస్టు ఏర్పాటు?

నెల్లూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం పక్కదారి పట్టడం.. ఇదేమీ కొత్త విషయం కాదు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ వ్యవహారం నడుస్తున్నా అడపాదడపా అధికారులు పట్టుకొని పెనాల్టీలు విధించి వదిలేయడం తప్ప కఠినచర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇదే అలుసుగా అక్రమార్కులు మాఫియాగా ఏర్పడి బియ్యాన్ని బొక్కేస్తున్నారు. పేదల బియ్యాన్ని మళ్లీ రీసైక్లింగ్ చేసి ప్రజల్లోకి తీసుకొస్తూ రూ.కోట్ల సంపాదించుకుంటున్నారు. కృష్ణా, గోదావరి జిల్లాల్లో రేషన్ బియ్యాన్ని విదేశాలకు అక్రమంగా ఎగుమతి చేస్తుండగా, నెల్లూరు జిల్లాలో మాత్రం రీసైక్లింగ్ చేస్తూ ప్రజలను దోచుకుతింటున్నారు. నెల్లూరు శివార్లలోని గుడిపల్లిపాడు కేంద్రంగా ఈ రేషన్ మాఫియా శాసిస్తుండగా, కావలి, కందుకూరు ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తోంది.

● నిఘా వర్గాల ద్వారా సమాచారం

రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం కన్నెర్ర చేసింది. ఎక్కువ పక్కదారి పడుతున్న జిల్లాల్లో పరిస్థితిని నిఘా వర్గాల నుంచి సమాచారం తెప్పించుకుంది. ఆ జాబితాలో నెల్లూరు కూడా ఉండడం గమనార్హం. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.. అమరావతిలోని సచివాలయంలో నెల్లూరు, విశాఖ, కాకినాడ జిల్లాల పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేషన్ బియ్యం అక్రమ రవాణాను నిలువరించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటి వరకూ 6ఏ కేసులు నమోదు చేసి పెనాల్టీలు విధించి వదిలేస్తుండగా, ఇకపై ఆ పద్ధతికి స్వస్తి చెప్పాలని సూచించారు. 6ఏతోపాటు పీడీ యాక్టు, బీఎన్ఎస్ చట్టాల కింద కూడా కేసులు నమోదు చేసి అక్రమార్కుల ఆట కట్టించాలని మంత్రి ఆదేశాలిచ్చారు. అంతేగాక పోర్టు ప్రాంతంలో 24 గంటల చెక్‌పోస్టును పెట్టాలని ఆదేశించడం గమనార్హం. ఈ ఆదేశాలతోనైనా రేషన్ మాఫియాకు అధికారులు చెక్ పెడతారా? అన్నది చూడాలి.

● ఇక్కడ రూ.15.. అక్కడ 60

జిల్లాలో ఏడు లక్షల రేషన్ కార్డులు ఉండగా, సుమారు 20 లక్షల మంది బియ్యాన్ని తీసుకుంటున్నారు. ప్రతీ నెలా సుమారు 10 వేల టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం కిలో రూపాయికే అందిస్తోంది. ప్రతీ నెలా సరాసరి 87 శాతం మంది రేషన్ బియ్యాన్ని తీసుకుంటున్నట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. అయితే రేషన్ తీసుకుంటున్న వారిలో సగం మంది వరకూ ఆ బియ్యాన్ని తినడం లేదు. ఇంతకుముందు ఇంటి దగ్గరకు వచ్చే వ్యక్తులకు బియ్యాన్ని అమ్మేసేవారు. అయితే ఇప్పుడు రేషన్ తీసుకున్న చోటనే బేరం జరుగుతోంది. రేషన్ పంపిణీ చేసే వ్యక్తులే 'మీకు బియ్యం కావాలా..? డబ్బులు కావాలా..? అని అడుగుతున్నారు. డబ్బులు కావాలని చెబితే కిలోకు రూ.15 చొప్పున ఇచ్చేసి కొనేస్తున్నారు. ఇప్పుడు కొత్తగా కార్డుదారులను షాపు వరకు రానీయకుండా నేరుగా ఇళ్లకే వెళ్లి వేలిముద్రలు వేయించుకుంటుండడం గమనార్హం.



నెల్లూరులోని కుమ్మరివీధిలో రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు (ఫైల్)

● అందరికీ వాటాలే..!

ప్రతిషాపులో ప్రతీ నెలా ఏ స్థాయిలో బియ్యం కొనుగోలు జరుగుతోందో స్పష్టత ఉంటుంది కాబట్టి ఆ స్థాయి మొత్తం బియ్యం బస్తాలను నేరుగా రేషన్ మాఫియాకు చేరవేస్తున్నారు. ప్రతీ నెలా సుమారు 2 వేల టన్నుల రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు అంచనా. ప్రధానంగా గుడిపల్లిపాడు కేంద్రంగా ఈ మాఫియా దందా నడుపుతోంది. రేషన్ బియ్యం మొత్తాన్ని అక్కడకు చేరవేసి, అక్కడున్న మిల్లుల్లో రీసైక్లింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ బియ్యాన్ని మార్కెట్లో పేరున్న బ్రాండ్ల పేరుతో బస్తాల్లో నింపి (కిలో రూ.60 చొప్పున) విక్రయిస్తున్నారు. ఇలా మాఫియా ఒక్కో కేజీకి రూ.40 వరకూ మిగుల్చుకుంటోంది. ఇందులో రూ.10లు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, అధికారులకు పంపకాలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కోవూరు, జూలై11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోవూరు, పడుగుపాడు, గంగవరం, ఇనమడుగు, మోడేగుంట గ్రామాల్లో శనివారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇనమడుగు సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మత్తులు చేస్తున్నందున ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9345
వెండి కిలో ధర	రూ. 110200
వెండి ఒక గ్రాము	రూ. 113.20

దిష్టిబొమ్మల్లా కియోస్క్‌లు

- వైసీపీ ప్రభుత్వంలో ఆర్‌బీకేల్లో ఏర్పాటు
- నిరుపయోగంగా యంత్రాలు
- రూ. కోట్ల ప్రజాధనం వృథా

మనుబోలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు మేలు చేకూరేలా గత వైసీపీ ప్రభుత్వం రైతులకు అనేక హామీలు గుప్పించింది. ప్రతి సచివాలయం వద్దనే రైతు భరోసా కేంద్రాలు (రైతుసేవా కేంద్రాలు) ఏర్పాటు చేసింది. కోట్లాది రూపాయలతో ప్రతి కేంద్రంలో ఎల్‌ఈడీ టీవీలు, ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసేందుకు కియోస్క్ యంత్రాలను కొనుగోలు చేసింది. ఒక్కో ఎల్‌ఈడీ టీవీ రూ. 45 వేలు, కియోస్క్ యంత్రం రూ. 75 నుంచి రూ.80 వేలతో ఏర్పాటు చేసినప్పటికీ వీటిని సరిగా వినియోగించలేదు. దీంతో ఇవన్నీ కొన్ని నెలలుగా మూలనపడ్డాయి. రైతు సేవా కేంద్రాల్లో దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

జిల్లాలో మొత్తం 561 రైతుసేవా కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిలో కోట్లాది రూపాయలతో 561 ఎల్‌ఈడీ టీవీలు, 561 కియోస్క్ యంత్రాలను కొనుగోలు చేసి 561 కేంద్రాలకూ అందజేశారు. అయితే నాణ్యత లేని కియోస్క్ యంత్రాలను అందజేయడంతో బ్యాటరీలు సరిగా పనిచేయక, ఇంటర్ నెట్ సౌకర్యం లేకపోవడంతో పాటు, ఇతర సమస్యలతో అవి నిరుపయోగంగా మారాయి. వీటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకు రావాల్సిన ఏజెన్సీలు పట్టించుకోక పోవడంతో వ్యవసాయశాఖ సిబ్బందే వీటిని మూలనపడేశారు. వ్యవసాయ శాఖ నుంచి రైతులకు సబ్సిడీపై అందించే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, అవసరమైన అన్ని రకాల సేవలకూ వ్యవసాయ శాఖ సిబ్బంది తమ సెల్‌ఫోన్లనే వినియోగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండానే కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చుచేసి నాణ్యత లేని టీవీలు, యంత్రాలను కొనుగోలు చేసిందని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచింది. అయినా ఇప్పటికీ వ్యవసాయశాఖ సిబ్బందిగానీ, అధికారులుగాని టీవీలు, యంత్రాలను వినియోగించడం లేదు. కనీసం రైతుసేవా కేంద్రాల్లో సమావేశాలు, 'పొలం పిలుస్తోంది' వంటి కార్యక్రమాల్లో కూడా టీవీలు, కియోస్క్ యంత్రాలను ఉపయోగించకపోవడం గమనార్హం.

ఇకనైనా జిల్లా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన టీవీలు, కియోస్క్‌లు వృథా కాకుండా వెంటనే వాడుకలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.



చెర్లోపల్లి ఆర్‌ఎస్‌కేలో వృథాగా ఉన్న కియోస్క్


వినియోగంలోకి తీసుకువస్తాం

కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మారిన సంగతి నా దృష్టికి రాలేదు. రైతులకు కావాల్సిన వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, పురుగుమందులు, ఈ పంట నమోదు, క్షేత్రస్థాయి పరిశీలన వంటి పనులకు ప్రస్తుతం యాప్‌లు రావడంతో ఎక్కువగా సెల్‌ఫోన్లనే సిబ్బంది వినియోగిస్తున్నారు. కియోస్క్‌లు వాడాలంటే రైతుసేవా కేంద్రాలకు వచ్చి నమోదు చేయాలి. వీఏఏలు ఎక్కువగా సెల్‌ఫోన్ల ద్వారానే ఇచ్చిన సర్వేలను ఉపయోగిస్తున్నారు. ఆర్‌ఎస్‌కేల్లో ఉన్న కియోస్క్ యంత్రాలను సరిచేయించి, రైతులకు ఉపయోగపడేలా అన్నింటినీ వినియోగంలోకి తీసుకువచ్చేందుకు వెంటనే చర్యలు తీసుకుంటాం.

- సత్యవాణి,
జిల్లా వ్యవసాయాధికారిణి

80 శాతం సబ్సిడీతో రెండు డ్రోన్ల మంజూరు

మండల వ్యవసాయాధికారి పత్తిపాటి వెంకటకృష్ణయ్య



మనుబోలు, (ఆంధ్రజ్యోతి): మండలానికి ప్రభుత్వం రెండు డ్రోన్లు మంజూరు చేసిందని మండల వ్యవసాయాధి కారి పత్తిపాటి వెంకటకృష్ణయ్య తెలిపారు. ఒక్కో డ్రోన్ విలువ రూ.9.8 లక్షలని, 5 మంది రైతులు కలిసి రూ. 2 లక్షలు (20 శాతం) చెల్లిస్తే మిగిలిన మొత్తం సబ్సిడీతో ప్రభుత్వం డ్రోన్లు అందిస్తుందన్నారు.

? భూసార పరీక్ష కార్డులు వచ్చాయా? ఎప్పుడు ఇస్తారు

! ఇప్పటివరకు మండలంలో 1242 మట్టి నమూనాలు తీసి పంపాం. ఇంకా ఫలితాల కార్డులు రాలేదు. నెలాఖరులోగా వస్తే రైతు లకు అందజేస్తాం.

? 'అన్నదాత సుఖీభవ' ఎప్పుడు విడు దల చేస్తారు

! ఈ పథకానికి సంబంధించి 5957 మంది రైతుల వివరాలు తీసుకుని ఈకేవైసీ చేయించాం. అర్హుల జాబితా వచ్చింది. ప్రభుత్వం 13 వరకు గడువిచ్చింది. రైతుల నుంచి గ్రీవెన్స్ వస్తే వాటిని తీసుకుని పూర్తి జాబితా వచ్చాక ఇచ్చే అవకాశం ఉంది.

? 'పొలం పిలుస్తోంది'తో రైతులు ఏవేవి అడుగుతున్నారు

! వారానికి రెండు రోజుల పాటు నాలుగు పంచాయతీల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహిస్తున్నాం. రైతులు ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు, జింకు, జిప్సమ్ సబ్సిడీ కింద ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం.

జాతీయ స్థాయిలో
విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలు చూపుతున్న విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యాశాఖ, పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పుల శాఖ సంయుక్తంగా నిర్వహించిన జాతీయస్థాయి పోటీలలో రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు వెంకట ప్రకాష్, వెంకట సంజన, షేక్ కరిష్మా, తువ్వర జేమ్స్ ప్రశంసాపత్రాలు అందుకోవడం గర్వకారణమని హెచ్‌ఎం వేదవతి, 20వ వార్డు కౌన్సిలర్ చలంచర్ల శ్రీదేవి, ఎస్సీ సెల్ సభ్యులు చలంచర్ల సునీల్, రామచంద్రారెడ్డి, కోటయ్య ఉపాధ్యాయులు అభినందించారు. రిసోర్స్ పర్సన్ సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసుల వితరణ



ప్లేట్లు గ్లాసులు అందజేస్తున్న సత్యనారాయణ

వెంకటాచలం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కనుపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ప్లేట్లు, గ్లాసులను వితరణ చేశారు. సింహపురి గ్లాస్, ప్లైవుడ్ అధినేత, ఇండియన్ జూనియర్ ఛాంబర్ నేషనల్ డైరెక్టర్ సత్యనారాయణ రూ. 30 వేల విలువ చేసే ప్లేట్లు, గ్లాసులు అంద జేశారు. హెచ్‌ఎం హైమావతి, ఉపాధ్యా యులు ఉమామహేష్, పెంచలయ్య తదిత రులు పాల్గొన్నారు.

అంకమ్మ తిరునాళ్ల ప్రారంభం



మనుబోలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రజకవీధి అంక మ్మ దేవాలయంలో శుక్రవారం అంకమ్మ తిరునాళ్ళ ఘనంగా ప్రారంభమైంది. శనివారం రాత్రి గ్రామో త్సవం, ఆదివారం ఆలయం వద్ద పొంగళ్ళు, ప్రత్యేక పూజలు చేయనున్నారు. మూడు రోజుల పాటు తిరునాళ్ల జరగనుంది. 2015 తరువాత తిరిగి అంకమ్మ తిరునాళ్ల ప్రస్తుతం జరుగుతోంది. దీంతో రజక సంఘం నాయకులు ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

సంక్షేమ పాలనే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

విడవలూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమ పాలనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. అలగానిపాడు, అన్నారెడ్డి పాళెం, ముదివర్తిలో జరిగిన సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో శుక్ర వారం ఆమె పాల్గొన్నారు. ప్రజలతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు పుల్లారెడ్డి, మండల పరిశీలకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య, మండలపార్టీ అధ్యక్షులు ఏటూరు హరిరెడ్డి, నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, సింహాద్రి అయ్యప్ప, పొనగంటి నారాయణ, ఎస్‌కె రఫీ పాల్గొన్నారు.

తాగునీరు వృథా.. పట్టించుకోని అధికారులు



తోటపల్లిగూడూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వెంకన్నపాలెం పంచాయతీ పరిధిలోని దళిత కాలనీలో తాగునీటి కొళాయికి ట్యాప్ లేకపోవడంతో నీరు వృథా అవుతోంది. ప్రజలు తాగు నీటి కోసం అల్లాడు తుంటే, నీరు వృథాగా పోతున్నా పంచాయతీ సిబ్బంది పట్టించు కోలేదని కాలనీవాసు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కొళాయికి ట్యాప్ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

బుచ్చిలో కొవ్వొత్తుల ర్యాలీ



నిరసన ర్యాలీలో పాల్గొన్న మహిళలు, నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైసీపీ నేత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం బుచ్చిలో మహిళలు నిరసన ర్యాలీ చేపట్టారు. బెజవాడ గోపాల్ రెడ్డి పార్కు నుంచి చెన్నూరు రోడ్డు మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు ఈ ర్యాలీ సాగింది. తరలివచ్చిన మహిళలు ప్లకార్డులు చేతబూని ప్రసన్నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డుల సభ్యులు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం

వెంకటాచలం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుండే ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలని రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ కేఈసీ విద్యాసాగర్ సూచించారు. వెంకటాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. నారాయణ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇంటితోపాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నారాయణ కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడి ప్రొఫెసర్లు డాక్టర్ జ్యోతి, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ అలీ, డాక్టర్ శ్రావణి, డాక్టర్ లతిక పాల్గొన్నారు.

ఇంటింటికీ ప్రభుత్వ ఫలాలు

వెంకటాచలం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికీ ప్రభుత్వ ఫలాలను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా అందిస్తోందని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కంటేపల్లిలో శుక్రవారం సాయంత్రం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. తన సతీమణి సోమిరెడ్డి శృతిరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దొడ్డక చెంచురామయ్య, డబ్బుగుంట సుధాకర్, అట్ల మల్లికార్జున్, ఆస్తోటి నాగరాజు, షేక్ రఫీ, దొడ్డక నందకిషోర్, ఆస్తోటి సుబ్బయ్య, పెంచలయ్య, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ నేత ఆత్మహత్యాయత్నం

విడవలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం కృషి చేసిన తనను కాదని, వైసీపీ నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారంటూ మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమాంబాషా శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మండలంలోని ముదివర్తిలో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి ఇమాంబాషా పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. సొంతపార్టీలోనే తనకు ఆదరణ కరువుతోందంటూ వెంట తెచ్చుకున్న పురుగుల మందు సేవించారు. ఇంతలో అక్కడే ఉన్న వారు ఆయన్ను అడ్డుకుని హుటాహుటిన నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇమాంబాషాను, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

● టీడీపీ ఓ కుటుంబం లాంటిది : అజీజ్

నెల్లూరు (హరనాథపురం) : తెలుగుదేశం పార్టీ ఒక కుటుంబం లాంటిదని నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. మైనారిటీ నేత ఇమాం బాషా ఆత్మహత్యాయత్నంపై నెల్లూరులో ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క కార్యకర్తకూ పార్టీలో అన్యాయం జరగదని చెప్పారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఇమాంబాషా కొంచెం ఎమోషనల్ కావడం వల్లే ఇలా జరిగిందని, అన్నీ సర్దుకుంటాయని తెలిపారు.

టీడీపీలోకి జడ్పీ వైస్ చైర్‌పర్సన్ జయలక్ష్మి



టీడీపీలో చేరిన జడ్పీ వైస్ చైర్‌పర్సన్ జయలక్ష్మి, ప్రసాద్ దంపతులు

ఇందుకూరుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, ప్రసాద్ దంపతులు శుక్ర వారం వెయ్యి మంది కార్యకర్తలతో తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వైసీపీలో ఇమడలేక టీడీపీలో చేరారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి టీడీపీ కండువాలు వేసి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ తెలుగుదేశంలో కార్యకర్తలకు సముచిత గౌరవం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ తనకు మద్దతుగా పలువురు వైసీపీ మహిళా నేతలు తెలుగుదేశం పార్టీలో చేరడం సంతోషంగా ఉందని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, పవన్‌రెడ్డి, పీఎల్‌రావు, కొండూరు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి పీ-4తో సాధ్యం!



డంపింగ్ యార్డు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, జూలై 11 (ఆంధ్ర జ్యోతి): గ్రామాల సంపూర్ణ అభివృద్ధి పీ-4తో సాధ్యమని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆయన అధికారులు, టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ముత్తుకూరు గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు అదానీ కృష్ణపట్నం పోర్టు ముందుకు రావడం అభినందనీయమన్నారు. పోర్టు ప్రతినిధులు టీడీపీ నాయకులతో కలిసి ప్రస్తుతం డంపు చేస్తున్న స్థలాలను, స్మశానాన్ని పరిశీలించారు. కృష్ణపట్నం పోర్టు కార్పొరేట్ ఎఫైర్స్ ప్రతినిధి మృత్యుంజయ రామ్, సీవీఆర్ ఫౌండేషన్ ప్రతినిధి రాజేశ్వరం జన్‌తో కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగమణి, తహసీల్దారు స్వప్న, మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు నీలం మల్లికార్జున యాదవ్, మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

● కాకాణి మీద పెట్టినవన్నీ సక్రమ కేసులే...

పొదలకూరు : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిపై పోలీసులు నమోదు చేసిన కేసులన్నీ సక్రమ కేసులేనని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇనుకుర్తిలో 'సుపరి పాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున నాయుడు, టీడీపీ నాయకులు అక్కెం సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ పి. శ్రీనివాసులు రెడ్డి. వాకా శ్రీనివాసులు యాదవ్, గంటా మల్లికార్జున్, అలుపూరు శ్రీనివాసులు, పులిపాటి వెంకటరత్నంనాయుడు పాల్గొన్నారు.

● వ్యవసాయ యాంత్రీకరణకు పూర్వ వైభవం

తోటపల్లిగూడూరు : రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ యాంత్రీకరణకు పూర్వ వైభవం లభించిందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. వేదాయపాలెంలోని సోమిరెడ్డి కార్యాలయంలో శుక్రవారం పేడూరుకు చెందిన వెలిచెర్ల సుకుమార్ మోక్షశ్రీ గ్రూపునకు పురుగు మందులు పిచికారి చేసే డ్రోన్‌ను ఎమ్మెల్యేకి అందజేశారు. సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శ్రుతిరెడ్డి, మండల వ్యవసాయాధికారి పాల్గొన్నారు.

పందుల నుంచి విముక్తి కల్పించండి

వెంకటాచలం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జంగాలపల్లిలోని గిరిజన కాలనీలో పందుల బెడద తీవ్రంగా ఉందని, వాటి నుంచి తమకు విముక్తి కల్పించాలని గిరిజనులు వేడుకుంటున్నారు. సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడుతో కలిసి శుక్రవారం ఎంపీడీవో కల్పన, సీఐ సుబ్బారావుకు వినతి పత్రాలు అందజేశారు. ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణిభవాని, నేతలు సందూరి శ్రీహరి, మణి తదితరులున్నారు.

ఉద్యమాలతోనే మహిళా సంక్షేమం

ముత్తుకూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మహిళల సంక్షేమం కోసం పోరాడక తప్పని పరిస్థితులు నెలకొన్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ముత్తుకూరు శ్రామిక భవనంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 3వ మండల మహాసభ జరిగింది. ప్రతి కుటుంబానికి నెలకు 30 కేజీల బియ్యం, రూ. 3 వేల నగదును మండలంలో ఉన్న ప్రతి కుటుంబానికి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘం మండల అధ్యక్షురాలిగా ఆసాది మల్లమ్మ, కార్యదర్శిగా మన్నే పద్మమ్మను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ, సీఐటీయూ నాయకులు గడ్డం అంకయ్య పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ఉదయగిరిలో దారుణ హత్య!

- ఆస్తి వివాదాలే కారణం
- నిందితుల కోసం ప్రత్యేక బృందాల గాలింపు




హత్యకు గురైన హమీద్(ఫైల్)

ఉదయగిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆల్‌ఖైర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. కొండాపురం మండలం గరిమెనపెంటకు చెందిన షేక్ మహ్మద్ హమీద్‌కు (39) ఉదయగిరిలోని బీసీ కాలనీకి చెందిన రేష్మతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. గతంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసే హమీద్, తన సమీప బంధువులతో కలిసి 2023లో ఉదయగిరి ఆర్టీసీ డిపో సమీపంలో ఆల్‌ఖైర్ ఫంక్షన్‌హాల్ నిర్మించారు. అనంతరం ఫంక్షన్‌హాల్ విషయమై వారి మధ్య వివాదాలు చోటుచేసుకుని కేసులు సైతం నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం ఆ వివాదం కోర్టులో నడుస్తోంది. ఈ తరుణంలో హమీద్ శుక్రవారం రాత్రి స్థానిక యువకులతో కలిసి ఫంక్షన్‌హాల్‌కు తాళం వేసేందుకు వెళ్లాడు. ఇది తెలుసుకున్న వెంగళరావునగర్ గ్రామానికి చెందిన వారి సమీప బంధువులైన ఉమర్‌అలీ, హనీఫ్‌లు అక్కడకు చేరుకుని హమీద్‌పై కత్తి, రాడ్డుతో విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాలపాలైన హమీద్ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. నిందితులు పరారయ్యారు. హమీద్ వెంట వెళ్లిన యువకులు పరుగున పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపారు. ఎస్‌ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శ్రీనులు హుటాహుటిన తన సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్‌టీం హత్య జరిగిన ప్రదేశంలో వివరాలు సేకరించింది. అలాగే కలిగిరి సీఐ వెంకటనారాయణ సైతం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. హమీద్ హత్య విషయం తెలుసుకున్న భార్య రేష్మ, బంధుమిత్రులు కన్నీరుమున్నీరుగా విలపించడంతో అక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రశాంతంగా ఉండే ఉదయగిరిలో ఈ హత్య తీవ్ర కలకలం రేపింది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

సీతారామపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చంద్రశేఖరపురం మండలం అయ్యలూరివారిపల్లి గ్రామం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల పరిధిలోని సోంపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి సురేష్ (35) తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. సీ.ఎస్ పురం నుంచి ద్విచక్ర వాహనంపై సోంపల్లికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో అయ్యలూరి వారిపల్లె వద్ద జాతీయ రహదారిపై గేదెను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించగా అక్కడి వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం సురేష్ మృతి చెందాడని తెలిపారు.

బైకు ఢీకొని వృద్ధుడి దుర్మరణం



రోడ్డుపై పడి ఉన్న వెంకటేశ్వర్లు

కలిగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కలిగిరి-సంగం మార్గంలో వెలగపాడు గ్రామ సమీపంలో బైకు ఢీకొన డంతో వెంకటేశ్వర్లు(75) మృతి చెం దాడు. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా దర్శి సమీపంలోని కుడిచేడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు వెలగపాడు వద్ద ఉన్న ఓ వెంచర్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి వెంచర్‌లో నుంచి వెలుపలకు వచ్చి రోడ్డు మార్జిన్‌లో నడుచుకొంటూ వెళుతుండగా పాతనాపురం నుంచి కలిగిరి వైపు వస్తున్న బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడుని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించా రు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడని మృతుడి బంధువులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సోమశిలలో కొత్త వ్యక్తుల సంచారం?

అనంతసాగరం జూలై 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం వద్ద కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో చేపలవేట నిషేధం ఉంది. దీంతో వ్యాపారస్తులు కొందరు దొంగచాటుగా వేట సాగిస్తున్నారని, ఈక్రమంలో కొత్తవ్యక్తులు సంచరిస్తున్నారని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల జాలర్లను పిలిపించి అక్రమ వేటకు ఉపక్రమిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

బెల్టు దుకాణాలపై దాడులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టు దుకాణాలపై శుక్రవారం కలిగిరి ఎక్సైజ్ సీఐ మహమ్మద్ అబ్దుల్‌జలీల్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈనెల 8న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన నిబంధనలకు విరుద్ధంగా పల్లెల్లో మద్యం విక్రయాలు కథనానికి స్పందించిన ఆయన పథకం ప్రకారం దాడులు నిర్వహించారు. వరికుంటపాడులో నిర్వహించిన దాడుల్లో 43 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిర్వాహ కుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.



అరెస్టయిన నిందితుల వివరాలు వెల్లడిస్తునన సీఐ శ్రీనివాసులు

కిడ్నాప్ కేసులో 10 మంది ముద్దాయిల అరెస్ట్

బుచ్చిరెడ్డిపాళెం, జూలై11 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి కిడ్నాప్ కేసులో పది మంది నిందితులను బుచ్చి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుచ్చి పోలీస్‌స్టేషన్‌లోని తన చాంబర్‌లో సీఐ శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. ఆత్మకూరుకు చెందిన వాయుగుండ్ల రమేష్, దగదర్తికి చెందిన సురేంద్ర బాబుకు వ్యాపార, ఆర్థిక విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మనోజ్ అలియాస్ రాహుల్ ద్వారా రమేష్ కారులోని జీపీఎస్ ఆధారంగా ఏ సమయంలో ఎక్కడున్నాడనే వివరాలను సురరేంద్ర తెలుసుకున్నారు. 7వ తేదీన రమేష్ నెల్లూరు నుంచి బుచ్చికి వస్తుండగా నిందితులు వెంబడించారు. దీనిని గమనించిన రమేష్ కాగుపాడు మార్గంలో వెళ్తుండగా ఆసుపత్రి వద్దకు వెళ్ళేసరికి రమేష్ కారు పక్కనే ఉన్న చెరువులో పడిపోయింది. ఆ తర్వాత రమేష్‌ను నిందితులు తమ కారులోకి ఎక్కించుకుని పరారయ్యారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కారు నెంబరు ఆధారంగా పలు టోల్‌గేట్లు ప్రాంతాలకు సమాచారం ఇచ్చి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇంతలో రమేష్ కిడ్నాపర్ల చెరనుంచి తప్పించుకుని తమకు ఫిర్యాదు చేశాడని సీఐ తెలిపారు. ఈ మేరకు గురువారం నెల్లూరు తల్పగిరికాలనీలో 10మంది ముద్దాయిలను అరెస్టు చేసి విచారించగా డబ్బులు కోసమే కిడ్నాప్ చేసినట్టు తేలిందని తెలిపారు. శుక్రవారం నిందితులను కోర్టుకు హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	212
స్కిన్‌లెస్	234
కోడిగుడ్ల ధర (100):	540



'సిరిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి'

నెల్లూరు(క్రైం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : సీబీడీ స్వాధీనంలో ఉన్న భూములను విక్రయించి సిరిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని సీబీడీ డీఎస్పీ కోటారెడ్డిని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం సీబీడీ కార్యాలయంలో డీఎస్పీకి వినతిపత్రం ఇచ్చారు. సిరిగోల్డ్ ఆగ్రో పార్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ బోర్డు తిప్పేయడంతో అందులో పెట్టుబడి పెట్టిన బాధితులు న్యాయం కోసం పదేళ్లకుపైగా ప్రభుత్వాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. సిరిగోల్డ్‌లో ప్రజల దగ్గర బాండ్ల కొనుగోలు చేయించిన ఏజెంట్లు నానా అవస్థలు పడుతున్నారన్నారు. సిరిగోల్డ్ భూములను వెంటనే వేలం వేసి వచ్చిన నగదుతో బాధితులను ఆదుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

నేడు నగరంలో విద్యుత్ కోత

నెల్లూరు (జడ్పీ), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు శెట్టిగుంట రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని మాధవ మైలు, ప్రశాంతినగర్, వెంగళరెడ్డి నగర్, రాజీవ్ గాంధీ కాలనీ, ఇండస్ట్రీస్ ఏరియా, డీఎస్ నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు. అలాగే, ఎన్టీఆర్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్, సరస్వతి నగర్, పుట్టవీధి, పద్మావతి నగర్, ఆదిత్య నగర్, బాలాజీ నగర్ పరిసర ప్రాంతాల్లో నూ సరఫరా ఉండదన్నారు. కోటమిట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని జెండావీధి, కోటమిట్ట, కామటివీధి పరిసరాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వదరుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని సుందరయ్యకాలనీ, పదరుపల్లి, సత్యసాగర్ లేఅవుట్, ఆర్టీవో ఆఫీస్, మినీబైపాస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని తెలిపారు. రంగనాథ సబ్‌స్టేషన్ పరిధిలోని సబేదార్ పేట, కొండదిబ్బ, రంగనాయకుల పేట, కుమ్మరిపాళెం, సంతపేట, రైల్వేస్టేషన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో, ఇరగాళమ్మ సబ్‌స్టేషన్ పరిధిలోని రాజాగారివీధి, శాంతినగర్, పల్లిమిట్ట, బట్వాడిపాళెం, శివగిరి కాలనీ పరిసర ప్రాంతాల్లో, రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మనుమసిద్ధినగర్, పుత్తా ఎస్టేట్, గుప్పాపార్క్, ఈద్గామిట్ట, పొర్లుకట్ట, ముఖుమాల బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

సాయి మందిరంలో రుద్రాభిషేకాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గాంధీబొమ్మ కూడలి సమీపంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో శుక్రవారం గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. ఉదయం విశేష అలంకారం, దర్శనం, సహస్ర నామ పూజలు జరిగాయి. ఉభయకర్తలుగా పులిమి వెంకటరెడ్డి దంపతులు వ్యవహరించారు. మందిరం చైర్మన్ మన్నెం అమరనాథ్ రెడ్డి, కమిటీ సభ్యులు కొల్లి శ్యామసుందరరెడ్డి, పైడిపాటి సుధాకర్‌రావు, దువ్వూరు జయమ్మ పర్యవేక్షించారు.

రేపు నేత్ర శస్త్ర చికిత్స శిబిరం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా ఆదివారం బాలాజీనగర్ సాయిద ర్బార్ (అద్దాల మందిరం)లో నేత్ర శస్త్ర చికిత్స శిబిరం జరుగుతుందని మందిరం నిర్వాహకుడు మధుసాయి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయి భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోడుగాలికి వనం పురస్కారం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కథా రచయిత ఈతకోట సుబ్బారావు రచించిన పోడుగాలి కథా సంపుటికి తెలుగు సాహితీ వనం కథా పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే సభలో సుబ్బారావు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. తెలుగు సాహితీ వనం హైదరాబాద్ వారు డాక్టర్ రాణీ పులోమజాదేవి స్మారక కథా పోటీలు నిర్వహించారు. ఇందులో 'పోడుగాలి' ఉత్తమ కథా సంపుటిగా ఎన్నికైనట్లు నిర్వాహకుడు శాంతికృష్ణ తెలిపారు.

ఇరిగేషన్‌లో ఇంకో కుంభకోణం

మట్టి తవ్వకాల్లో మరో మేత!

మట్టి డబ్బు రూ.50 లక్షలు స్వాహా!

- దొంగ వర్కులు.. నామినేషన్ల కింద అప్పగింత
- వైసీపీ నేతలతో చేతులు కలిపిన అధికారులు?
- ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా పక్కదారి

నెల్లూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో ఇరిగేషన్ శాఖలో జరిగిన అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రజాధనాన్ని దోచుకున్న కుంభకోణాలు బయటపడుతున్నాయి. ఇప్పటికే అనేక అక్రమ వ్యవహారాలపై విజిలెన్స్, పోలీస్, సిట్ బృందాలు విచారణ చేస్తున్నాయి. ఈ క్రమంలో అనేక మంది జైళ్లకు వెళుతున్నారు. అయితే తాజాగా మరో దోపిడీ వ్యవహారం వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వంలో మట్టి తవ్వకాలకు అనుమతులు మంజూరు చేసే సమయంలో జమ చేసిన సీనరేజ్, వ్యవహారాలపై కొంత మంది పక్కదారి పట్టించారు. ఆ డబ్బులన్నీ దొడ్డిదారిలో మళ్లీ వైసీపీ నాయకుల జేబుల్లోకి వెళ్లిపోయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మొత్తం దాదాపు రూ.50 లక్షల వరకూ ఉంటుందని అంచనా.

తల కొంచెం....

చెరువుల్లో మట్టిని రైతులు క్యూబిక్ మీటర్లు రూపాయి చెల్లించి సొంత అవసరాలకు తీసుకెళ్లవచ్చు. అయితే వ్యాపార అవసరాలకు తీసుకెళ్లేందుకు నిర్దిష్ట గైడ్‌లైన్స్ లేవు. కానీ ఎప్పుడో పాత జీవోలను బయటకు తీసిన ఇరిగేషన్ అధికారులు.. వాటి మాటున కమర్షియల్ అవసరాలకు చెరువుల్లో మట్టిని తీసుకెళ్లేందుకు అనుమతులు ఇచ్చారు. ఇలా క్యూబిక్ మీటర్‌కు రూ.200 అంతకన్నా ఎక్కువ చొప్పున డీడీలు కట్టించుకున్నారు. ఈ అనుమతులు పొందిన వారిలో ఎక్కువ మంది వైసీపీ నాయకుల అనుయాయులే ఉండడం గమనార్హం. వారు చెల్లించిన మొత్తంలో మైనింగ్ శాఖకు చెందా ల్సిన రాయల్టీ కూడా ఉంది. కనుపూరు చెరువు, సర్వేపల్లి రిజర్వాయర్, కల్లూరుపల్లి చెరువు.. ఇలా సెంట్రల్ డివిజన్ పరిధిలో అనేక చెరువుల్లో తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. వీటి రూపంలో సుమారు రూ.50 లక్షల వరకూ సెంట్రల్ డివిజన్ ఈఈ ఖాతాకు జమయ్యాయి. నిబంధనల ప్రకారం ఈ డబ్బులో మైనింగ్ శాఖ ఖాతాకు నిర్దేశిత మొత్తాన్ని చెల్లించి, మిగిలినది ఇరిగేషన్ హెడ్ ఆఫ్ అకౌంట్‌లో జమ చేయాల్సి ఉంటుంది. కానీ నెల్లూరు సెంట్రల్ డివిజన్‌లో అలా జరగలేదు. మట్టి డబ్బులతో కొన్ని ఓఅండ్ఎం వర్కులను సృష్టించారు. ఈ దొంగ పనులను నామినేషన్ పేరుతో కొందరు వైసీపీ నేతలు, వారి బినామీలకు అప్పగించారు. ఆ వెంటనే చెక్కుల రూపంలో బిల్లులు కూడా చెల్లించారు. వాస్తవానికి ఇప్పుడు బిల్లులన్నీ సీఎఫ్ఎంఎస్ పద్ధతిలో చెల్లించాలని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నా, సెంట్రల్ డివిజన్‌లో అందుకు భిన్నంగా చెల్లింపులు జరిగాయి. ఆఖరుకు కలెక్టర్‌ను కూడా తప్పుదోవ పట్టించి, రాజకీయ నేతల నుంచి ఒత్తిడి చేయించి అనుమతులు సాధించుకున్నారని ఇరిగేషన్ శాఖలో ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంలో వైసీపీ నాయకులు, ఇరిగేషన్ అధికారులు కుమ్మక్కై నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తూతూ మంత్రంగా పనులు చేసి బిల్లులు చెల్లించేశారని, వాటిని తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా పంచేసు కున్నారని ప్రచారం జరుగుతోంది.



ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ కార్యాలయం



కనుపూరు చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాలు (ఫైల్)

అక్రమ తవ్వకాల విచారణతో వెలుగులోకి...

కనుపూరు చెరువులో అక్రమ మట్టి తవ్వకాలపై ప్రస్తుతం పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ క్రమంలో గతంలో అనుమతులు మంజూరు చేసినప్పుడు సింహపురి చెల్లించిన డీడీల నగదు ఏ ఖాతాలో ఉందని ఆరా తీశారు. ఇరిగేషన్ ఈఈ ఖాతా నుంచి ప్రభుత్వ ఖాతాకు జమ కావలసిన డబ్బులు దొడ్డిదారిలో వర్కుల పేరుతో చెల్లింపులు చేసినట్లు గుర్తించారు. ఇరిగేషన్ శాఖలో అధికారుల బదిలీ తర్వాత కూడా ఈ పోలీసులే ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు ఇరిగేషన్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. అసలు ఎప్పుడు ఈ డబ్బును డ్రా చేశారు..?, ఏఏ పనుల పేరుతో ఉపయోగించారు..?, ఏ రూల్ ప్రకారం, ఎవరి ఆదేశాల మేరకు ఇలా చేశారన్నది తేలాల్సి ఉంది. విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో వాడినట్లున్నారు

కొన్ని మట్టి అనుమతులకు సంబంధించి సెంట్రల్ డివిజన్ ఈఈ ఖాతాకు జమైన నగదును గతంలోనే వాడే ఎనట్లున్నారు. కింది స్థాయి సిబ్బంది నుంచి ఈ విషయం నాకు తెలిసింది. నేను వచ్చాక ఒక్క రూపాయి కూడా ఉపయోగించలేదు. ప్రతీ రూపాయి అకౌంట్‌లోనే ఉంది.

- దేశ నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ

రూ.830 కోట్లతో నగర అభివృద్ధి

● అక్టోబరు నుంచి పనులు : మంత్రి నారాయణ



అధికారులు, పార్టీ శ్రేణులతో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని ప్రజల అవసరాలను తీర్చేందుకు రూ.830 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులు, సిటీ నియోజకవర్గ టీడీపీ శ్రేణులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నగర వాసులకు పూర్తి స్థాయి అభివృద్ధి ఫలాలను అందించేందుకు అక్టోబరు నుంచి పనులు మొదలుపెడుతున్నట్లు చెప్పారు. నగర వ్యాప్తంగా డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు జోరుగా సాగుతున్నాయని పేర్కొన్నారు. యాజీడీ పనులు ఈ ఏడాదికి పూర్తవుతాయని స్పష్టం చేశారు. వీఆర్ హైస్కూలును ఆధునీకరించి విద్యాలో మరో 13 స్కూళ్లను ఆధునీకరించబోతున్నట్లు తెలిపారు. 9వ డివిజన్‌లో 22 ఎకరాల్లో మార్కెట్ ఏర్పాటు చేస్తామని, అల్లీపురం వద్ద ఉన్న డంపింగ్ యార్డును పూర్తిగా తొలగించి హంగులతో కూడిన పార్కును నిర్మించబోతున్నట్లు తెలిపారు. పెన్నా నదిలో వాటర్ స్పోర్ట్స్‌కి ప్రణాళిక తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే వాటిని తిరిగి తీసేసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, తాళ్లపాక అనూరాధ, విజేత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొట్టెల పండుగ విజయవంతం

● మంత్రికి వెండి భరిణెలో ఖురాన్ బహూకరణ

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రొట్టెల పండుగ విజయవంతం అయినందుకు గంధోత్సవం నిర్వాహకుడు షేక్ ఖలీల్ అహ్మద్ శుక్రవారం మున్సిపల్ మంత్రి నారాయణను క్యాంపు కార్యాలయంలో సత్కరించారు. వెండి భరిణెలో పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని బహూకరించి అభినందించారు. మంత్రి నారాయణ చొరవతో రొట్టెల పండుగ ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవంతంగా ముగిసిందన్నారు. ఈ కార్యక్రమంలో గంధం కమిటీ సభ్యులు షేక్ నయీం, షేక్ రియాజ్, బాబు, ఖలీద్, రెహాన్, గాయాజ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రాపూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబులాయపల్లి గ్రామ సమీపాన జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. రాపూరు మండలం నవాబుపేట గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులైన శీనయ్య, పవన్, మరొకరు బద్వేల్ నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. ఓబులాయపల్లి గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారమివ్వగా రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రసన్న క్షమాపణ చెప్పాలి

● సీమాంధ్ర ఎమ్మార్పీఎస్



విలేకరులతో మాట్లాడుతున్న సుబ్బయ్య

నెల్లూరు(హరనాథపురం), జూలై 11 : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వ్యక్తిగతంగా, సంస్కార హీనంగా మాట్లాడిన మాజీ మంత్రి ప్రసన్న కుమార్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రసన్న వాడిన భాషను అందరూ ఖండిస్తున్నారన్నారు. ఆయన అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా దళిత అధికారులను ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ సేవాసమితి అధ్యక్షుడు కాకి శ్రీనివాసులు, నాయకులు పల్లిపాటి చిన్నయ్య, ఆనందరావు, రియాజ్, దాసు, డానియల్, కోటి సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో 'డబుల్ మేజర్'ను కొనసాగించాలి

● ఎస్ఎఫ్ఐ నిరసన

నెల్లూరు(విద్య), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీలో డబుల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని, ఇంటర్నల్ మార్కులను తగ్గించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని వీఆర్‌సీ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీ నరేంద్ర మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి రోజుకో నిర్ణయం తీసుకుంటూ డిగ్రీ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. డిగ్రీలో డబుల్ మేజర్ అమలుకు ఉత్తర్వులిచ్చి ఆచరణలో మాత్రం సింగిల్ మేజర్ విధానమే కొనసాగించడం ఆక్షేపణీయమన్నారు. రాష్ట్రంలోని స్టేక్ హోల్డర్స్‌తో సంప్రదించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇంటర్ ఫలితాలు వెలువడి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టకపోవడం విద్యామండలి వైఫల్యాలను తెలియజేస్తోందన్నారు. దీనిపై ముమ్ముందు మరిన్ని పోరాటాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, నాగేంద్ర, సుకు మార్, యశ్వంత్, లోకేష్, ధనుష్, సంతోష్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో అవకాశాలపై విద్యార్థులకు అవగాహన

నెల్లూరు(విద్య), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కళాశాల విద్యార్థులు ఎన్‌సీసీలో చేరితే లభించే అవకాశాలు, కలిగే ప్రయోజనాలపై నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్ర ఈఎంఈ, ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో ఆర్మీ రిక్రూటింగ్ విభాగం నిర్వహించిన కార్యక్రమంలో కల్నల్ రాజత్ సువర్ణ మాట్లాడుతూ భారత సైన్యంలో అధికారులుగా, అగ్నివీరులుగా చేరేందుకు ఎన్‌సీసీ కేడెట్స్, విద్యార్థులకు ఎన్నో అవకాశాలున్నాయని చెప్పారు. విద్యార్థులు, కేడెట్స్ సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌టీ కల్నల్ ఎన్ దినేష్, కళాశాల డీన్ సుధారాణి, ప్రిన్సిపాల్ నాగయ్య, ఎన్‌సీసీ అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కేడెట్స్‌తో ఎన్‌సీసీ అధికారులు

పాఠశాలల్లో విద్యార్థుల ఎన్నికలు

నెల్లూరు(విద్య), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామలింగా పురం నారాయణ కాన్సెప్ట్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. పాఠశాల హెడ్ బాయ్, హెడ్ గర్ల్, హౌస్ కెప్టెన్‌తోపాటు తరగతుల వారీగా లీడర్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వీ విజయభాస్కర్‌రెడ్డి, క్లస్టర్ ప్రిన్సిపాల్ డీ నరేంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్ వెంగళరావు, రాయ్ సోషల్ క్లబ్ సభ్యులు సౌజన్య, రమేష్, అనిష్, గ్రీష్మ, ముస్కాన్, ఏవో శివ రంజిత్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికల్లో ఓటు వేస్తున్న విద్యార్థులు

● నగరంలోని విశ్వసాయి డాక్టర్ ఎస్ఆర్‌కే పాఠశాలలో శుక్రవారం స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు స్కూల్ లీడర్స్, క్లాస్ లీడర్లను ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటు వేసి ఎన్నుకున్నారు. ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జీ కృష్ణ మోహన్, వై శివసంకీర్త, ప్రిన్సిపాల్ ఎస్ రమారాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సిఫార్సు అక్కర్లేదు

రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం ప్రజలు వస్తే వెంటనే పని చేయాలని, ఎవరి నుంచి సిఫార్సులు చేయించుకోవాల్సిన అవసరం లేదని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం 28వ డివిజన్ న్యూ మిలటరీ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. అనంతరం ప్రజలు, కార్పొరేషన్ అధికారులతో కలిసి ముఖాముఖి నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తీర్చాలని అధికారులను సూచించారు. కాగా, 26వ డివిజన్ డ్రైవర్స్ కాలనీలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నిర్వహించారు. కార్పొరేటర్లు చెక్కా పహ్లాన్, బూడిద సుప్రజ, టీడీపీ నాయకులు రాజా నాయుడు, మమత రెడ్డి, సాయి సునీల్, నాయకులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై

ప్రజలను అప్రమత్తం చేయండి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కీటక జనిత వ్యాధుల వల్ల అనేక ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, వీటిపై ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నగరంలోని జేవీఆర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని లేక్‌వ్యూ కాలనీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆమె ఇంటింటికీ తిరిగి నీటి నిల్వలను పరిశీలించి వాటిని ఒలకబో యించారు. మురికి కాలువలను పరిశీలించి దోమల నివారణ మందు పిచికారీ చేయాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉండదని స్థానికులకు అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సేకరించే రక్తనమూనాలు వెంటనే ల్యాబ్‌కు చేర్చాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి నాగార్జున రావు, వెంకటేశ్వర్లు, రమణి, మంగమ్మ, అనూష తదితరులు పాల్గొన్నారు.



నీటి నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

గుట్టు తేలుద్దాం!

(5వ పేజీ తరువాయి)

నడుపుతూ నకిలీ మద్యం వ్యాపారం చేస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. దీంతో ఆయన్ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. ఈ క్రమంలో గుడ్లూరులోని ఆయన ఇంట్లో సోదాలు చేయగా భారీగా ఖాళీ బాటిళ్లు, మద్యం సీసాలు దొరికాయి. నకిలీ మద్యం తయారీలో కలిపే 400 లీటర్ల రెక్టిఫైడ్ స్పిరిట్‌ను, సీలింగ్ స్టిక్కర్లు, సీలింగ్ మిషన్, ఖాళీ సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

● **జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు**

గుడ్లూరు ప్రాంతంలో నకిలీ మద్యం పట్టుబడిన తర్వాత జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేస్తున్నారు. వైన్‌షాపులు, బార్లు, ఆర్డీసీ బస్టాండ్ల లోని కార్గో పాయింట్లు, ప్రైవేటు ట్రావెల్స్ పార్శిల్ సర్వీస్ పాయింట్లు తదితర ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. రికార్డులను పరిశీలించడంతోపాటు ఏ సరుకు ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్తుందో కూపీలాగే పనిలో ఉన్నారు. ఆ సరుకు వచ్చినదే కనుక సుమారుగా ఆరా తీస్తున్నారు.

నకిలీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

నకిలీ మద్యం తయారీ, విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గుడ్లూరులో నకిలీ మద్యం పట్టుబడ్డ తర్వాత జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేస్తున్నాం. ప్రభుత్వ అనుమతులు పొందిన వైన్‌షాపులు, బార్లలో మాత్రమే మద్యం కొనుగోలు చేయాలి. బయట ప్రాంతాల్లో మద్యం కొనుగోలు చేయవద్దు.

- దయాసాగర్, ఎక్సైజ్ డీసీ

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

(5వ పేజీ తరువాయి)

ఎరువుల దుకాణాలు గోదాముల్లో తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయాధికారి ఎస్కే జహీర్ మాట్లాడుతూ రైతులు తమకు కొన్ని ఎరువులకు బదులుగా సరిగా రశీదు అడిగి తీసుకోవాలన్నారు. ఆదేవిధంగా వ్యాపారులు కూడా ఎమ్మార్పీ కంటే అధిక ధరకు ఎరువులు విక్రయించకూడదని హెచ్చరించారు. సిద్దనకొండూరు పీఏసీఎస్‌లో యూరియా అందుబాటులో ఉందని, కలిగిరి, కుడుములదిన్నెపాడు పీఏసీఎస్‌లలో యూరియా తెప్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అనంతలో మల్టీ డే క్రికెట్ పోటీలు..

● చిత్తూరుపై నెల్లూరు జట్టు ఘన విజయం

అనంతపురం (క్రికెట్), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : అనంతపురంలో అనంత క్రీడా గ్రామంలో జరుగుతున్న సీనియర్ మల్టీ డే క్రికెట్ పోటీలలో నెల్లూరు జట్టు చిత్తూరుపై 59 పరుగుల తేడాతో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన నాల్గవ రౌండ్ పోటీలలో అనంతపురం-కర్నూలు జట్లు తలపడ్డాయి. మొదట ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 267 పరుగులు చేయగా, కర్నూలు 109/4తో రెండో రోజు బ్యాటింగ్ కొనసాగించి.. 178 పరుగులకు ఆలౌట్ అయ్యింది. రెండో ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 204 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం 293 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు, రెండో రోజు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. అనంత జట్టు మొదటి ఇన్నింగ్స్ లీడ్తో విజయం సాధించబోతోంది.

● చిత్తూరు-నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు 23.3 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఓవర్‌నైట్ స్కోర్ 215/4తో రెండో రోజు ప్రారంభించిన నెల్లూరు జట్టు.. 83.1 ఓవర్లలో 413 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మొదటి రోజు రేవంత్ రెడ్డి సెంచరీ చేయగా, రెండో రోజు సుబ్రమణ్యం 216 బంతుల్లో 21 బౌండరీలు, రెండు సిక్సర్లతో 160 పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన చిత్తూరు, రెండో రోజు 49.2 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో నెల్లూరు జట్టు ఇన్నింగ్స్ 59 పరుగుల తేడాతో విజయం సాధించింది.

పారిశుధ్యం నిర్వహణలో కావలికి 12వ స్థానం

కావలి, జూలై 11(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో కావలి మున్సిపాలిటీ రాష్ట్రంలో 12వ స్థానం దక్కించుకుంది. రాష్ట్రంలో 77 మున్సిపాలిటీల్లో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో కావలి 12వ స్థానంలో నిలిచిందని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అందించిన సహాయ సహకారాలు, ప్రజలు సహకారంతో పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు వివిధ్య కార్యక్రమాలు చేపట్టడం ద్వారా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందగలిగిందన్నారు.

చిన్నయ్య హంతకులను అరెస్ట్ చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నెల్లూరు(క్రైం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వేదాయపాళెం ప్రాంతంలో మేనెల 6వ తేదీ జరిగిన చిన్నయ్య హత్య కేసులో వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు గొల్లపల్లి శ్రీనివాసులు మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంకు నుంచి జిల్లా పోలీసు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్పీ కృష్ణకాంత్ సాయికి వినతి పత్రం ఇచ్చారు. ఈ కేసును నీరుగార్చాలని పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల వెంకయ్య మాదిగ, మంద వెంకటేశ్వర్‌రావు మాదిగ, పందిటి అంబేడ్కర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



అనంతసాగరం : సొసైటీ కార్యాలయం ముందు బారులు తీరిన ఆటోలు



సంగం : సొసైటీ వద్ద రైతుల నిరీక్షణ

యూరియా కోసం బారులు

యూరియా కోసం రైతులు పడు తున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. అనంతసాగరం వ్యవసాయ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం యూరియా పంపిణీ చేస్తుండగా రైతులు భారీగా అక్కడకు చేరుకొన్నారు. కార్యాలయం ముందు ఆటోలు కూడా బారులు తీరాయి. సబ్సిడీపై యూరియా అందజేస్తుండగా పంపిణీలో ఒత్తిడి పెరిగింది. అవసరమైన రైతులకు ఎరువులు అంద జేస్తామని, ఆందోళన చెందవద్దని ఏవో శైలజాకుమారి తెలిపారు.

● సంగంలో పడిగాపులు

సంగం సొసైటీలో సర్వర్‌లో సరిగా లేక శుక్రవారం ఈ పాస్ ఆగిపోయింది. మళ్లీ కార్యదర్శి వేలిముద్ర వేస్తేగాని ఈ పాస్ ఆన్ కాదు. ఆయన అందుబాటులో లేకపోవ డంతో యూరియా కోసం వచ్చిన రైతులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఒకవైపు యూరియా డిమాండ్ కారణంగా సకాలంలో లభ్యం కావడంలేదు. అధికారులు స్పందించి సర్వర్ పనిచేసేలా చర్యలు తీసుకోవడంతోపాటు అధికారి అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు. - అనంతసాగరం/సంగం, (ఆంధ్రజ్యోతి)

మహాభారతంలో భద్రకాళి పూజ

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మహా భారతంలో శ్రీకృష్ణరాయబార ఘట్టం అనంతరం కురు పాండవులు మహాభారత యుద్ధా నికి సిద్ధమైన వేళ జరిగే విశేషాలతో శుక్రవారం ఉత్సవం జరిగింది. అలుగు నిలుపులు, ఐలావంతుని వధ, భద్రకాళి పూజలు జరిగాయి. ఉదయం హోమాలు, భగవద్గీత పారాయణం, చప్పర ఉత్సవం జరిగాయి. రాత్రి మహాభారత ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రేపు ఇరగాళమ్మకు
శాకంబరి అలంకారం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం శాకంబరి అలంకారం జరుగుతుందని ఈవో వి.గిరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అందరూ శాకాంబరి అలంకారంలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిం చాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు
పెంపొందించాలి : కలెక్టర్

నెల్లూరు(విద్య), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక తరగతుల నుంచే విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు అధికారులు, ఉపా ధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శుక్ర వారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో బడిపిల్లల ప్రావీణ్యత గురించి నిర్వ హించిన పరాఖ్ సర్వేక్షన్ సర్వే-2024 ఫలితాలపై విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పిల్లల విద్యా సంబంధ విషయాలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల నాణ్యతా ప్రమాణాలను పెం పొందించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో పిల్లల్ని మోడల్ స్కూల్స్‌లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహ పడేలా తయారు చేయాలని తెలిపారు. డీఈఓ బాలాజీరావు మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలోని 108 పాఠశాలల్లో 3, 6, 9 తరగతులకు చెందిన 2,927 మంది విద్యార్థులు, 379 మంది ఉపాధ్యాయులు ఈ సర్వేలో పాల్గొన్నారన్నారు. ఉపాధ్యాయుల ప్రమే యం లేకుండా పిల్లలు స్వతహాగా ఈ సర్వేలో పాల్గొనేలా నిర్వహించినట్లు చెప్పారు. ప్రాథమిక తరగతుల నుంచి ఉన్నత పాఠశాల తరగతులకు వచ్చిన విద్యార్థుల్లో కొన్ని అంశాల్లో ప్రావీణ్యత తగ్గడం గమనించామన్నారు. దీనిని అధిగమించేందుకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, డిప్యూటీఈఓలు, ఎంఈఓలు, డైట్ అధ్యాపకులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మహాసభ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వెంగళరావు యాదవ్, నాయకులు

17న బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభ

● జాతీయ అధ్యక్షుడు వెంగళరావు

నెల్లూరు(హరనాథపురం), జూలై 11 : ఈనెల 17న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభ జరు గుతుందని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వెంగళరావు యాదవ్ తెలిపారు. నెల్లూరులోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీల సమస్యలపై తమ సంఘం రాజీలేని పోరాటం చేస్తోందని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు బొమ్మి నాగకిషోర్ మాట్లాడుతూ బీసీ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో మహాసభ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్ర మంలో పెరుమాళ్ల పద్మజా యాదవ్, దేవరాల సుబ్రహ్మణ్యం, ఆవుల నరసిం హం, గుంజి మనోహర్, బెల్లంకొండ శీనయ్య, నక్కల నాగరాజు పాల్గొన్నారు.

బాలసదన్‌లో చైర్‌పర్సన్ తనిఖీ

నెల్లూరు(హరనాథపురం), జూలై 11 : నెల్లూరులోని బాలసదన్‌ను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ బీ పద్మావతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సదన్‌లోని పిల్లలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదు పెట్టెలను, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో జీసీడీవో మమత తదితరులు పాల్గొన్నారు.



బాలసదన్‌ను తనిఖీ చేసి రికార్డులు చూస్తున్న పద్మావతి

'పోగు'బంధం
తెంచుకుని..

● ప్రత్యామ్నాయ వృత్తుల్లోకి చేనేతలు ● గిట్టుబాటు కాని నేతపని

● పెరిగిన ఖర్చులతో కష్టంగా మారిన జీవనం

● మనసు చంపుకుని మగ్గాలకు దూరంగా..

● వందల కుటుంబాలు 'ఉపాధి' కోసం వలస

● ప్రభుత్వ చేయూత కోసం ఎదురు చూపు

నెల్లూరు రూరల్లోని నారాయణరెడ్డిపేట ప్రాంతానికి చెందిన శీనయ్య (పేరు మార్పు) చేనేత కార్మికుడు. ఇంట్లోనే మగ్గం ఉంటుంది. తల్లిదండ్రులు, భార్యతో కలిసి నేత నేసేవాడు. నేత దుస్తులకు గిరాకీ తగ్గి కూలీ సరిపోవడంలేదు. ఎంత మంది నేత నేసినా కుటుంబ అవసరాలు తీరని దుస్థితి నెలకొంది. గత్యంతరం లేక, కుటుంబ పోషణ భారమై నెల్లూరు నగరంలో కూలి పనికి వెళ్తున్నాడు.

ములుముడిలోని మరో కుటుంబానిదీ ఇదే దుస్థితి. ఇంట్లో మగ్గం నేసుకుంటూ ఇద్దరు పిల్లల్ని చదివించాల్సి రావడంతో ఆర్థిక ఇబ్బందులతో అప్పులు పెరిగాయి. దీంతో పిల్లల్ని బడికి పంపి మగ్గం పక్కన పెట్టి భార్య, భర్తలిద్దరు బయట పనులకు వెళ్తున్నారు. నేత పనికి గిరాకీ లేకపోవడం, కూలి ధరలు గణనీయంగా తగ్గిపోవడంతో ఈ పరిస్థితి ఎదురైనట్లు వారు చెప్పుకొచ్చారు.

నెల్లూరు రూరల్. జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం నారాయణరెడ్డిపేటలో సుమారుగా 300 మంది మగ్గాలపై ఆధారపడి జీవిస్తుండగా, మరో 400 కుటుం బాలు ప్రత్యామ్నాయ వృత్తుల్లోకి వెళ్లిపోయాయి. ములుముడి గ్రామంలో ప్రస్తుతం 50 మగ్గాలుండగా మరో 200 కుటుంబాల వారు ఉపాధి కోసం వలస బాటపట్టారు. ఇక సౌత్‌మోపూరులో వందకు పైగా మగ్గాలుండగా 200 కుటుంబాలకు చెందిన నేతన్నలు ఇతర రంగాల్లోకి అడుగుపెట్టారు. మగ్గం ఉన్నప్పటికీ నెల పొడవునా పని లేకపోవడం, చేసిన పనికి తగిన కూలి దక్కకపోవడంతో ఉపాధి కోసం వలసబాటపడుతున్నారు.

బతుకుతెరువు కోసం ఇతర రంగాల్లోకి...

కుటుంబాన్ని పోషించుకునేందుకు, అప్పుల ఊబి నుంచి గట్టెక్కేందుకు చేనేత కార్మికుల కుటుంబాలు వలసబాట పడు తున్నాయి. ఆటో డ్రైవర్లుగా కొందరు జీవిస్తుండగా, కొన్ని కుటుంబాల్లో భార్య, భర్తలిద్దరు బేల్దారి పనులకు వెళ్తున్నారు. యువకులు దుకాణాల్లో యువతులు పాఠశాలలు, కళాశాల్లో పనులకు చేరుతున్నారు. మరికొందరు పెయింటింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్లు, క్యాటరింగ్ వైపు ఉపాధిని వెతుక్కుంటున్నారు. ఇంకొందరు రొయ్యల ఫ్యాక్టరీలు, కృష్ణపట్నం పోర్టులో డైలీ కూలీలుగా పనిచేస్తున్నారు. బయట పనులకు వెళ్లలేని వారు ఇంట్లోనే ఉండి అచ్చులు అతుకుతూ, అల్లుల వద్ద సహాయకులుగా, కండెలు చుడుతూ వచ్చినదాంతో సరిపెట్టుకుంటున్నారు.



నారాయణరెడ్డిపేటలో నిరుపయోగంగా మగ్గం

ప్రభుత్వ చేయూత కోసం ఎదురు చూపు

గత వైసీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసిందని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ మైనా తమకు అండగా నిలుస్తుం దేమోనని చేనేత కార్మిక కుటుంబాలు ఆశగా ఎదు రు చూస్తున్నాయి. జగన్ పాలనలో ఏడా దికి ఒకసారి డబ్బులిచ్చి చేతులు దులు పు కోవడంతో నేత పరిశ్రమ పూర్తిగా కుదేలైంది. నూలుపై సబ్సిడీలు, నేత కార్మికులకు వృత్తి ప్రోత్సాహకాలు లేవు. దీని వల్ల పరిశ్రమ ఉనికికి ప్రమాదం ఏర్పడింది. ఇప్పటి ప్రభుత్వ మైనా తమ కళను గుర్తించి జిల్లాలో నేత జబారు ఏర్పాటు చేస్తే మగ్గాలపై తయారైన వస్త్రాలను అక్కడే అమ్ము కుంటామని చేనేతలు వేడుకుంటు న్నారు. నూలుపై సబ్సిడీ ఇవ్వడం వల్ల వ్యాపారులు మళ్లీ మగ్గాలకు పనిస్తారని, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తే ఆర్థికంగా కుదుటపడుతామని కోరుతున్నారు.

గిట్టుబాటులేక ఆటో నడుపుకుంటున్నా



ఇంట్లో మగ్గం నేసుకునేందుకు వీలున్నా కూలి గిట్టుబాటులేదు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. దీంతో ఆటో నడుపు కుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా. మగ్గం నెయ్యాలని ఉంది కానీ కష్టానికి తగిన ఫలితం దక్కడం లేదు.

- పడవల మురళి, సౌత్‌మోపూరు

వేరే పని చూసుకున్నాము



చేనేత పరిశ్రమను నమ్ముకుని ఇప్పటి వరకు జీవనం సాగించాము. పెద్దవాళ్లు బయటకు రాలేని దుస్థితి. ఉపాధి అవకాశాల కోసం మేమంతా బయటకు వచ్చేశాము. వేరే పనులు చేసుకుంటూ ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడుతున్నాము.

- పముజుల శ్రీనివాసులు, ములుముడి

ప్రభుత్వం చేయూతనందిస్తే....



మేమంతా మగ్గాలకు దూరంగా నేత వృత్తిని వదులుకోవాల్సి వచ్చింది. పనిలేదు, ఉన్నా గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం చేనేత పరిశ్రమకు చేయూతనిచ్చి, సబ్సిడీలు, వస్త్రాలు అమ్ముకునేందుకు మార్కెటింగ్, కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తే తిరిగి మగ్గం నేసుకుని వృత్తిని కాపాడుకుంటాము.

- కటికాల వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డిపేట

దారికాచి యువకుడిపై
గుర్తుతెలియని వ్యక్తుల దాడి

లింగ సముద్రం, జూలై 11 (ఆంధ్ర జ్యోతి) : ఓ యువకుడిపై గుర్తు తెలి యని ఇద్దరు యువకులు దారికాచి దాడి చేసిన ఘటన మండ లంలోని తిమ్మారెడ్డిపాలెం మోడల్ స్కూల్ సమీపంలోని గండివాగు బ్రిడ్జి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ దాడిలో గంగపాలెం ఎస్సీ కాలనీ (మాదిగపాలెం)కు చెందిన బొమ్మల రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి బంధు వుల కథనం మేరకు.. కందుకూరు పొగాకు బోర్డులో పని చేస్తు న్న రాజేష్ సాయంత్రం 4 గంటల సమయంలో వెంగళాపు రంలో బస్సు దిగి తన ద్విచక్ర వాహనంపై గంగ పాలెం వెళ్తుండగా తిమ్మారెడ్డిపాలెంలోని మోడల్ స్కూల్ సమీపంలో గండివాగు బ్రిడ్జి వద ఇద్దరు యువకులు రాజేష్‌ను ఆపి సెల్‌ఫోన్ ఇవ్వమని అడి గారు. అయితే రాజేష్ సెల్‌ఫోన్ ఇవ్వక పోవడంతో వారు రాజేష్‌ను బలంగా నెట్టడంతో మోటారు సైకిల్‌తో సహా కింద పడ్డాడు. దీంతో ఆ ఇద్దరు యువకులు రాజేష్ దాడికి పాల్ప డ్డారు. అయితే వారి నుంచి తప్పించుకున్న రాజేష్ బంధు వుల సహాయంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

భాగవత సప్తాహం ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 3వ మైలు రామకృష్ణ మిషన్‌లో శుక్రవారం రాత్రి పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో భాగవతంపై ప్రవచనా లు (సప్తాహం) ప్రారంభమయ్యాయి. దీనిని రామకృష్ణ మిష న్ శ్రీహృదానందజీ మహరాజ్ అనుగ్రహ భాషణతో ప్రారం భించారు. అవధాని కోట రాజశేఖర్, ప్రహ్లాద చరిత్రలో మధు ర ఘట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పోలవరపు లక్ష్మీనరసింహారావు, చీమకుర్తి వెంకటేశ్వరరావు, ఎన్.బల రామయ్యనాయుడు, అగస్త్యరాజు సుబ్బారావు, తుర్లపాటి లక్ష్మీ నారాయణ, డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య పాల్గొన్నారు.



భాగవత సప్తాహ సభ ప్రారంభోత్సవంలో ప్రముఖులు

వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారిణి శోభారాణి

ఉదయగిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు వసతిగృహ సంక్షేమాధి కారులు కృషి చేయా లని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారిణి కె శోభారాణి సూచించా రు. శుక్రవారం స్థానిక ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయంలో ఉదయగిరి డివిజన్ పరిధిలోని వసతిగృహాల సంక్షేమాధికా రులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రతి వసతిగృహంలో వంద మంది విద్యార్థులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 64 వసతి గృహాల్లో మరమ్మతు పనులు జరుగు తున్నాయని, ఇప్పటికే 85 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 15 శాతం పనులు పూర్తిచేసి విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిం చడంతోపాటు పీహెచ్‌సీ వైద్యాధికారిచే వైద్యశిబిరం నిర్వహించాలన్నారు. ప్రభు త్వం విద్యార్థుల సౌకర్యార్థం వసతి గృహాల్లో అన్ని వసతులు కల్పిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పిం చాలని ఆమె కోరారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో కె రమ ణారెడ్డి, వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లగడపాటి రామానాయుడు ఐటీఐగా
సంగం ప్రభుత్వ ఐటీఐ మార్పు

● ప్రభుత్వం జీవో నెం.239 విడుదల

సంగం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభు త్వ ఐటీఐకి ఇక లగడపాటి రామానాయుడు ప్రభు త్వ ఐటీఐగా పేరు మార్చుతూ శుక్రవారం రాష్ట్ర ప్ర భుత్వం జీవో ఆర్‌టి నెంబరు 239 విడుదల చేసిం ది. సంగం ప్రభుత్వ ఐటీఐ 2013లో మంజూరైంది. దీంతో సంగంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శిథిలావస్థకి చేరి ఖాళీగా వదిలేసిన మూడు భవనాలలో తాత్కాలికంగా ఐటీఐని ప్రారంభించా రు. నాలుగేళ్ల కిందట సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కొత్త భవనాలు మంజూరు కావడంతో ఐటీఐ నిర్వహిస్తున్న తాత్కాలిక భవనాలను ఖాళీ చేయాల్సి వచ్చింది. దీంతో సంగంలో ప్రభుత్వ భవ నాలు అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతం ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో నాలుగేళ్లుగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో 2023 లో హైదరాబాదుకు చెందిన జీఆర్ఎస్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించేందుకు ముందుకు రావడంతో జీఆర్ఎస్ (గంటా రమణయ్య నాయు డు ప్రభుత్వ ఐటీఐగా జీవో విడుదల చేసింది. కానీ ఆ కంపెనీ ఐటీఐకి కేటాయించిన స్థలంలో జంగిల్ క్లియరెన్స్ చేసినా 18 నెలలుగా భవనాలు నిర్మించ లేదు. ఈ నేపథ్యంలో దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో మండ లంలోని తరుణవాయి పంచాయతీ అమరపనా యుడు కండ్రికలో ల్యాంకో ఫౌండేషన్ 2.25 ఎకరా ల్లో నిర్మించి అసంపూర్తిగా ఉన్న రెండు బ్లాక్‌ల్లో మూడు ఫ్లోర్‌లతో 32 గదులను ఐటీఐకి అప్పగిం చేందుకు అంగీకరించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలు పరిశీలించిన ప్రభుత్వం అందుకు అంగీకరించి సంగం ప్రభుత్వ ఐటీఐని లగడపాటి రామానాయుడు ప్రభుత్వ ఐటీఐగా మార్చుతూ జీవో ఆర్టీ నెంబరు 239 విడుదల చే సింది. దీంతో సంగం ప్రభుత్వ ఐటీఐకి శాశ్వత భవ నాలు ఏర్పడనున్నాయి. దీంతో ఇటు అధ్యాపకులతో పాటు అటు విద్యార్థులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ల్యాంకో ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.



సంగం ప్రభుత్వ ఐటీఐకి అప్పగించిన ల్యాంకో ఫౌండేషన్ భవనాలు ఇవే

'ఉపాధి' బిల్లుల విడుదల
హర్షణీయం

● ఎమ్మెల్సీ బీద

నెల్లూరు (వైద్యం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పెండింగ్ బిల్లు ల విడుదలకు ఉత్తర్వులు ఇవ్వటం ఆనందంగా ఉందని ఎమ్మెల్సీ, ఉపాధి పథకం హామీ పెండింగ్ నిధుల సాధన కమిటీ సమన్వయకర్త బీద రవిచంద్ర ఓ ప్రకట నలో పేర్కొన్నారు. ఈ నిధులు వచ్చేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ ప్రత్యేక కృషి చేశారని తెలిపారు. 2014 - 19 కాలంలో టీడీపీ ప్రభుత్వం చేప ట్టిన ఉపాధి హామీ పథకం పనుల బిల్లులను వైసీపీ ప్రభుత్వం కక్షిపూరితంగా ఆపివేసిందని ఆరోపించారు. ఆ బిల్లుల కోసం ప్రస్తుత ప్రభుత్వం నిరంతరం కేంద్రం తో సంప్రదించిందని, త్వరలో రూ. 231 కోట్లు విడుదల కానున్నాయని బీద వెల్లడించారు.

'సోమశిల'కు పెరిగిన వరద

అనంతసాగరం జూలై 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం శుక్రవారం పెరిగింది. గురువారం 165 క్యూసెక్కులు ఉండగా మరుసటి రోజుకు 1,131 క్యూసె క్కులుగా నమోదయ్యింది. ప్రస్తుతం డ్యాంలో 28.660 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 2,650 క్యూసె క్కులు సరఫరా చేస్తున్నారు.

కాన్పుల మధ్య అంతరం ఉండాలి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత

● అధిక జనాభా అనర్థాలపై ప్రదర్శన



జెండా ఊపి ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మహి ళల ఆరోగ్యం కోసం కాన్పుకి, కాన్పుకి మధ్య అంతరం ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. జనాభా పెరుగు దలతో కలిగే అనర్థాలపై శుక్రవారం నెల్లూరులో అవగాహన ప్రదర్శన జరి గింది. నగరంలోని పొదలకూరు రోడ్డులో ఈ ప్రదర్శనను డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభించారు. జనాభా పెరుగు దల అనర్థాలు, సురక్షిత మాతృత్వం, వివిధ కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. డాక్టర్ సుజాత మాట్లాడుతూ మాతృత్వం కోసం ప్రణాళికాబద్ధంగా నడుచుకోవాలని సూచించారు. దీనిపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని, ప్రతీ గర్భిణికి వైద్య పరీక్షలు... వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిం చేలా దంపతులను చైతన్యపరచాల న్నారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ జనాభా పెరుగుదలను అదుపు చేయాలన్నారు. గర్భస్థ పిండ నిర్ధారణ చట్టం లింగ నిష్పత్తి సమతు ల్యత, ఆడపిల్ల పుట్టుక ఆవశ్యకతపై డెమో కనరత్నం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంవో డాక్టర్ రమేష్, డీఎంవో హుస్సేనమ్మ, డిప్యూటీ హెచ్‌ఈవో వెంకటేష్, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గంగాభవానీ అమ్మవారికి నెలపొంగళ్లు

ఉదయగిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న అనంతపూరి గంగాభవానీ అమ్మవారికి ఆదివారం నెలపొంగళ్లు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలు ముగిసి నెలరోజులు పూర్తయిన సందర్భంగా ఈ పొంగళ్లు నిర్వహిస్తున్నట్లు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9312
వెండి కిలో ధర	రూ. 110300
వెండి ఒక గ్రాము	రూ. 113.30

నింగినంటుతున్న కూరగాయల ధరలు

బెంబేలెత్తుతున్న సామాన్య ప్రజలు

● కిలో టమోటా రూ.40, మిర్చి 80, బీన్స్ ౧20 ● ఉత్పత్తి తగ్గడమే కారణం



కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి

ఉదయగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు రోజురోజుకు నింగినంటుతున్నాయి. దీంతో సామాన్య ప్రజలు బెంబేలెత్తుతున్నారు. చుక్కలు చూపిస్తున్నాయి. వేసవిలో పెరగాల్సిన ధరలు ఇప్పుడు రోజురోజుకు పెరిగిపోతుండడంతో సామాన్యులు కొనుగోలు చేయాలంటనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వారం రోజుల వ్యవధిలోనే కిలోకు రూ.10 నుంచి రూ.20ల వరకు కొన్ని రకాల కూరగాయల ధరలు పెరిగాయి. మరికొన్ని రూ.20 నుంచి రూ.30ల వరకు పెరిగాయి. ఉత్పత్తి తగ్గడమే ధరల పెరుగుదలకు కారణమని, ఇంకా పెరిగే అవకాశముందని వ్యాపారస్తులు తెలుపుతున్నారు. వారం రోజుల వ్యవధిలో టమోటా కిలో రూ.20 ఉండగా ప్రస్తుతం రూ.40కి చేరింది. బీన్స్ కిలో రూ.80 ఉండగా ప్రస్తుతం రూ.120, పచ్చిమిర్చి గత వారం రూ.120 ఉండగా కాస్త తగ్గి ప్రస్తుతం రూ.80కి చేరింది. వర్షాలు సక్రమంగా కురవక పోవడంతో కూరగాయల సాగు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఉత్పత్తి తగ్గి ధరలు పెరుగుతున్నా యని వ్యాపారస్తులు అంటున్నారు. దూరప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవడంతో ధరలు పెరుగుతున్నాయని, ధరలు ఇంకా పెరిగే అవకాశముందని వారు తెలిపారు.



గ్రామాల్లో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

● ఐజాక్‌ప్రవీణ్, ఎంపీడీవో

అనంతసాగరం జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు.

? చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయా.

! కొన్నిచోట్ల చెత్తసంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్న విషయం వాస్తవమే. గ్రీన్ అంబాసిడర్లను నియమించుకొని వాటిని వినియోగంలోకి తెచ్చేలా కృషిచేస్తున్నాం

? నిరుపయోగంగా ఉన్న కొత్త సచివాలయ భవనాల పరిస్థితి ఏమిటి.

! ఇటీవలే ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించాను. విచారించి కొత్త భవనాలు వినియోగించుకునేలా చూస్తాం.

? గ్రామాల్లో వసతుల మెరుగుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! తరచూ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమస్యలు తెలుసుకుంటున్నాం. తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపడుతున్నాం.

న్యూస్ బాక్స్

పాడిరైతులకు అవగాహన సదస్సు

సీతారామపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బసినేనిపల్లి, సీతారామపురం బీట్-1 రైతు సేవా కేంద్రాలలో పశువైద్యాధికారి రామవేందర్ ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకవార్షిక దాన్యపు జాతికి చెందిన పారాగడ్డి, సూపర్ నేపియర్ తదితర జాతులను సాగు చేసుకుని పశువులకు దాణాగా వినియోగించుకోవచ్చు నన్నారు. దీంతో పాల ఉత్పత్తి పెరగడంతో ఖర్చులు తగ్గి పాడి రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ఏహెచ్ఏలు నరేష్‌రాజు, తమ్మిశెట్టి శిల్ప, మహమ్మద్ గౌస్, కొండయ్య పాల్గొన్నారు.

13 లోగా అన్నదాత సుఖీభవకు నమోదు చేసుకోండి

ఏఎస్ పేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి ఈనెల 13వ తేదీలోగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు శుక్రవారం ప్రకటన ద్వారా తెలిపారు. మండలంలో మొత్తం 8239 నమోదు చేయగా 5311 ఇకెవైసి పూర్తిచేయాలని జాబితా రాగా అందులో 5186 ఇకెవైసి పూర్తిచేశామని తెలిపారు. మిగిలిన వారు రైతుసేవా కేంద్రంలో పరిశీలించుకోవాలని తెలిపారు. కౌలు రైతులు విఆర్‌వో దగ్గర కౌలు రైతుకార్డులు పొంది నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎఎస్ పేట డిప్యూటీ ఎంపీడీవోగా మునిరత్నం

ఏఎస్ పేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఏఎస్ పేట మండల డిప్యూటీ ఎంపీడీవోగా మునిరత్నం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాదకరంగా సోమశిల - ఆత్మకూరు ప్రధాన రహదారి



ముళ్లపొదలతో మూసుకుపోయిన సోమశిల - ఆత్మకూరు రహదారి

అనంతసాగరం జూలై 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల - ఆత్మకూరు ప్రధాన రహదారి ముస్తాపురం అలుగు వాగు వద్ద నుంచి పాతాళపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు ముళ్లపొదలతో మూసుకు పోయింది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో ప్రమాదాలు జరుగు తున్నా యి. అధికారులు దృష్టి సారించి ముళ్ల పొదలు తొలగించేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు

వైభవంగా అశ్వత్థానారాయణ కల్యాణం



అశ్వత్థనారాయణ కల్యాణం తిలకిస్తున్న భక్తులు

సంగం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినగర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయంలో జరుగుతున్న గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం అశ్వత్థనారాయణ కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు, కాగడ హారతి నిర్వహించారు. అనంతరం ఆలయం ప్రాంగణంలోని వేపచెట్టు, రావిచెట్టుకు అశ్వత్థనారాయణస్వామిగా భావించి కల్యాణం నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైసీపీ తప్పుడు ప్రచారంపై టీడీపీ నేతల ఖండన



టీడీపీలో కొనసాగుతున్న తమ కార్యకర్తలతో నాయకులు

మర్రిపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నుంచి పలువురు వైసీపీలో చేరినట్లు వైసీపీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని స్థానిక టీడీపీ నాయకులు ఖండించారు. మర్రిపాడు మండలం పొంగూరు గ్రామంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు తమతోనే ఉన్నారని ఎస్సీ కాలనీలోని తమ కార్యకర్తలతో నాయకులు శుక్రవారం మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా స్థానిక నాయకులు ఏలూరు శివ మాట్లాడుతూ గురువారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నామని, అది చూసి ఓర్వలేక ఎస్సీ కాలనీలో 70మంది టీడీపీని వీడి వైసీపీలో చేరినట్లు ఆ పార్టీకి చెందిన పత్రికలో ప్రచురించుకోవటం సరైనది కాదని ఎద్దేవా చేశారు. తమ నేతలు, కార్యకర్తలు తమతోనే ఉన్నారని వారు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులు

ఏఎస్ పేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ స్కూల్‌లో శుక్రవారం మేరా యువ భారత్ నెల్లూరు యూత్ ఆఫీసర్ మహీంద్రారెడ్డి, హెల్ప సంస్థ డైరెక్టర్ వెలగపాటి వెంటేశ్వర్లు ఆధ్వర్యంలో అంతర్జాతీయ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని మహిత మొదటి స్థానం, రెండవ సంవత్సరం విద్యార్థిని ఎన్ సంధ్య రెండవ స్థానం, 10వ తరగతి విద్యార్థిని శ్రీలక్ష్మి మూడవ స్థానంలో నిలిచారు. వారికి బహుమతులు అందించారు.


ఎప్పటికి పూర్తయ్యేనో...!



అసంపూర్తి నిర్మాణంతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్

ఉదయగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనం నిధులేక అసంపూర్తిగా నిలిచిపోయింది. గుత్తేదారు సగం నిర్మాణం చేపట్టి అనంతరం నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిపివేశారు. భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో వైద్యఆరోగ్య సిబ్బంది అద్దె భవనంలో అవస్థలు పడుతూ రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం భవనం పనులు పూర్తి కాకుండానే శిథిలావస్థకు చేరుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.

చెత్తబుట్టలు పంపిణీ చేయరా!?



రైతుసేవా కేంద్రంలో ఉన్న చెత్తబుట్టలు

ఉదయగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గత ప్రభుత్వం అందజేసిన చెత్తబుట్టలు గదికే పరిమితమయ్యాయి. నివాసాల్లో తడి, పొడి చెత్తను ఈ బుట్టల్లో వేసి ఇంటివద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలి. వారు ఆ చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించాలి. అయితే పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న రైతుసేవా కేంద్రం-1లోని ఓ గదిలో చెత్తబుట్టలను భద్రపరిచారే తప్ప ప్రజలకు పంపిణీ చేయలేదు. బుట్టలు పంపిణీ చేయకపోవడంతో స్వచ్ఛాంధ్ర లక్ష్యం నీరుగారిపోతోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తబుట్టలు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆయిల్‌పామ్ తోటల పెంపకం లాభదాయకం



ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న శ్రీనివాసులు, ఇతర శాఖల అధికారులు

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ తోటల పెంపకం రైతులకు లాభదాయకంగా ఉంటుందని రాష్ట్ర ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ డైరెక్టర్ డాక్టర్ కె శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని వెంకటంపేట గ్రామంలో జరిగిన మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామాయిల్ సాగుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ బకాయిలు రూ.100 కోట్లు త్వరలో రైతులకు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. సూక్ష్మసేద్య పరికరాలు సైతం రాయితీపై అందిస్తుందన్నారు. ఆయిల్‌పామ్ సాగుతోపాటు అంతర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖాధికారి సుబ్బారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, ఏడీహెచ్ అనూరాధ, ఉదయగిరి, వింజమూరు ఉద్యాన శాఖాధికారులు జయశ్రీ, షహీల్, 3ఎఫ్ కంపెనీ ఏజీఎం సూర్యనారాయణ, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హక్కులకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బి పద్మావతి

ఆత్మకూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించి వారి హక్కులకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తల పద్మావతి తెలిపారు. ఆత్మకూరు మున్సిపాల్టీలోని ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పాఠశాల తరగతి గదులు, ప్రాంగణం అపరిశుభ్రంగా ఉన్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. గురుకుల పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ప్రతి తరగతి గదిలో టోల్ ఫ్రీ నెంబరు 1098ను డిస్‌ప్లే చేయాలని సూచించారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

పేదల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



కరపత్రాలను అందజేసి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల

ఆత్మకూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం అని టీడీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి తెలిపారు. ఏడాది పాలనలో సాధించిన విజయాలపై చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని పలు వార్డుల్లో స్థానిక టీడీపీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఎన్డీఏ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, ఆత్మకూరు అభివృద్ధికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేస్తున్న కృషిని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, కొప్పోలు చిన్నపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలి



విద్యార్థుల హాజరు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సూపర్వైజర్

సీతారామపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో సిబ్బంది సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ షేక్ షాను సూచించారు. ఆమె శుక్రవారం మండల పరిధిలోని పోకలింగాయపల్లి-2 అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన లబ్ధిదారులకు ఫేస్ క్యాప్చర్ ఈకేవైసీ, ఆధార్ ఫేస్ మ్యాచింగ్ నూరు శాతం పూర్తి చేయాలన్నారు.ఫేస్ యాప్ ద్వారా పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేపట్టి ప్రీస్కూల్ హాజరుశాతాన్ని పెంచాలన్నారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలను అందించారు.

నూతన పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి

సీతారామపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుండుపల్లిలో పోలింగ్ కేంద్రాలు ఉన్న స్కూల్ హైవే రోడ్డు విస్తరణలో తొలగించారు. దీంతో ప్రత్యామ్నాయంగా గూరువాండ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని గదులను శుక్రవారం తహసీల్దార్ కృష్ణారెడ్డి పరిశీలించారు. అనంతరం సీతారామపురం గ్రామ పంచాయతీలో ఓటర్ల నమోదు శాతం పెరిగినందున సీతారామపురం, నారాయణంపేట గ్రామాల్లో కొత్తగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు అనుకూల ప్రాంతాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో డీటీ సందాని, ఎంఎస్ శ్రీకాంత్, వీఆర్వో మనోహర్ పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి



చెత్త తరలింపును పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి అంజనేయులు

అనంతసాగరం జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పంచాయతీ కార్యదర్శి అంజనేయులు సూచించారు. శుక్రవారం ఆయన గ్రామంలో పర్యటించి పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు చెత్త తరలించే ట్రాక్టర్ వస్తుందని అందులోనే చెత్తను వేయాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దని సూచించారు. గ్రామ పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.

C.R.I.M.E N.E.W.S

ఉదయగిరిలో దారుణ హత్య!

- ఆస్తి వివాదాలే కారణం
- నిందితుల కోసం ప్రత్యేక బృందాల గాలింపు



హత్యకు గురైన హమీద్(ఫైల్)

ఉదయగిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆల్‌ఖైర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. కొండాపురం మండలం గరిమెనపెంటకు చెందిన షేక్ మహ్మద్ హమీద్‌కు (39) ఉదయగిరిలోని బీసీ కాలనీకి చెందిన రేష్మతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. గతంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసే హమీద్, తన సమీప బంధువులతో కలిసి 2023లో ఉదయగిరి ఆర్టీసీ డిపో సమీపంలో ఆల్‌ఖైర్ ఫంక్షన్‌హాల్ నిర్మించారు. అనంతరం ఫంక్షన్‌హాల్ విషయమై వారి మధ్య వివాదాలు చోటుచేసుకుని కేసులు సైతం నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం ఆ వివాదం కోర్టులో నడుస్తోంది. ఈ తరుణంలో హమీద్ శుక్రవారం రాత్రి స్థానిక యువకులతో కలిసి ఫంక్షన్‌హాల్‌కు తాళం వేసేందుకు వెళ్లాడు. ఇది తెలుసుకున్న వెంగళరావునగర్ గ్రామానికి చెందిన వారి సమీప బంధువులైన ఉమర్‌అలీ, హనీఫ్‌లు అక్కడకు చేరుకుని హమీద్‌పై కత్తి, రాడ్డుతో విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాలపాలైన హమీద్ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. నిందితులు పరారయ్యారు. హమీద్ వెంట వెళ్లిన యువకులు పరుగున పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపారు. ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శ్రీనులు హుటాహుటిన తన సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్‌టీం హత్య జరిగిన ప్రదేశంలో వివరాలు సేకరించింది. అలాగే కలిగిరి సీఐ వెంకటనారాయణ సైతం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. హమీద్ హత్య విషయం తెలుసుకున్న భార్య రేష్మ, బంధుమిత్రులు కన్నీరుమున్నీరుగా విలపించడంతో అక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రశాంతంగా ఉండే ఉదయగిరిలో ఈ హత్య తీవ్ర కలకలం రేపింది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

సీతారామపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చంద్రశేఖరపురం మండలం అయ్యలూరివారిపల్లి గ్రామం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల పరిధిలోని సోంపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి సురేష్ (35) తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. సీఎస్ పురం నుంచి ద్విచక్ర వాహనంపై సోంపల్లికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో అయ్యలూరి వారిపల్లె వద్ద జాతీయ రహదారిపై గేదెను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించగా అక్కడి వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం సురేష్ మృతి చెందాడని తెలిపారు.

బైకు ఢీకొని వృద్ధుడి..



రోడ్డుపై పడి ఉన్న వెంకటేశ్వర్లు

కలిగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కలిగిరి-సంగం మార్గంలో వెలగపాడు గ్రామ సమీపంలో బైకు ఢీకొన డంతో వెంకటేశ్వర్లు(75) మృతి చెం దాడు. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా దర్శి సమీపంలోని కుడిచేడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు వెలగపాడు వద్ద ఉన్న ఓ వెంచర్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి వెంచర్‌లో నుంచి వెలుపలకు వచ్చి రోడ్డు మార్జిన్‌లో నడుచుకొంటూ వెళుతుండగా పాతనాపురం నుంచి కలిగిరి వైపు వస్తున్న బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడుని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించా రు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడని మృతుడి బంధువులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సోమశిలలో కొత్త వ్యక్తుల సంచారం?

అనంతసాగరం జూలై 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం వద్ద కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో చేపలవేట నిషేధం ఉంది. దీంతో వ్యాపారస్తులు కొందరు దొంగచాటుగా వేట సాగిస్తున్నారని, ఈక్రమంలో కొత్తవ్యక్తులు సంచరిస్తున్నారని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల జాలర్లను పిలిపించి అక్రమ వేటకు ఉపక్రమిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

బెల్టు దుకాణాలపై దాడులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టు దుకాణాలపై శుక్రవారం కలిగిరి ఎక్సైజ్ సీఐ మహమ్మద్ అబ్దుల్‌జలీల్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈనెల 8న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన నిబంధనలకు విరుద్ధంగా పల్లెల్లో మద్యం విక్రయాలు కథనానికి స్పందించిన ఆయన పథకం ప్రకారం దాడులు నిర్వహించారు. వరికుంటపాడులో నిర్వహించిన దాడుల్లో 43 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిర్వాహ కుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.



అరెస్టయిన నిందితుల వివరాలు వెల్లడిస్తునన సీఐ శ్రీనివాసులు

కిడ్నాప్ కేసులో 10 మంది ముద్దాయిల అరెస్ట్

బుచ్చిరెడ్డిపాళెం, జూలై11 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి కిడ్నాప్ కేసులో పది మంది నిందితులను బుచ్చి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుచ్చి పోలీస్‌స్టేషన్‌లోని తన చాంబర్‌లో సీఐ శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. ఆత్మకూరుకు చెందిన వాయుగుండ్ల రమేష్, దగదర్తికి చెందిన సురేంద్ర బాబుకు వ్యాపార, ఆర్థిక విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మనోజ్ అలియాస్ రాహుల్ ద్వారా రమేష్ కారులోని జీపీఎస్ ఆధారంగా ఏ సమయంలో ఎక్కడున్నాడనే వివరాలను సురరేంద్ర తెలుసుకున్నారు. 7వ తేదీన రమేష్ నెల్లూరు నుంచి బుచ్చికి వస్తుండగా నిందితులు వెంబడించారు. దీనిని గమనించిన రమేష్ కాగుపాడు మార్గంలో వెళ్తుండగా ఆసుపత్రి వద్దకు వెళ్ళేసరికి రమేష్ కారు పక్కనే ఉన్న చెరువులో పడిపోయింది. ఆ తర్వాత రమేష్‌ను నిందితులు తమ కారులోకి ఎక్కించుకుని పరారయ్యారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కారు నెంబరు ఆధారంగా పలు టోల్‌గేట్లు ప్రాంతాలకు సమాచారం ఇచ్చి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇంతలో రమేష్ కిడ్నాపర్ల చెరనుంచి తప్పించుకుని తమకు ఫిర్యాదు చేశాడని సీఐ తెలిపారు. ఈ మేరకు గురువారం నెల్లూరు తల్పగిరికాలనీలో 10మంది ముద్దాయిలను అరెస్టు చేసి విచారించగా డబ్బులు కోసమే కిడ్నాప్ చేసినట్లు తేలిందని తెలిపారు. శుక్రవారం నిందితులను కోర్టుకు హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	212
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 540

పారిశుధ్యం నిర్వహణలో కావలికి 12వ స్థానం

కావలి, జూలై 11(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై నిర్వహణపై రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో కావలి మున్సిపాల్టీ రాష్ట్రంలో 12వ స్థానం దక్కించుకుంది. రాష్ట్రంలో 77 మున్సిపాల్టీలలో రాష్ట్రప్రభుత్వం చేట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో కావలి 12వ స్థానంలో నిలిచిందని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అందించిన సహాయ సహకారాలు, ప్రజలు సహకారంతో పట్టణంలో పారిశుధ్య మెరుగుదలకు విభిన్న కార్యక్రమాలు చేపట్టడం ద్వారా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందగలిగిందన్నారు.

376 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 450 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 376 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-56, ఆర్‌ఆర్-4, సీఆర్-11, జంపింగ్‌లాట్స్-3 కారణాలతో 74 బేళ్లు తిరస్కరించా. కిలో గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.212.03గా నమోదైంది.

న్యూస్ బాక్స్

ప్రపంచ జనాభా దినోత్సవం

కందుకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ అధ్యర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండలు నరేంద్ర మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా, లభ్యమవుతున్న వనరుల మధ్య సమతుల్యతపై ప్రజల్లో అవగాహన కల్పించటం లక్ష్యంగా ప్రతిఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకురాలు లక్ష్మి, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ రాజగోపాలబాబు, ప్రశాంతి, కె. కరుణకుమార్ పాల్గొన్నారు.

వైద్యాధికారి పర్యటన

బిట్రగుంట, జూలై 11(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీ, ఏటీకంద్రిక పంచాయతీని జిల్లా ఫ్లోరోసిస్ వైద్యాధికారి సీహెచ్.సాయిదివ్య శుక్రవారం సందర్శించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. గ్రామంలో ప్రజలు తాగుతున్న నీటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం. ఆశావర్కరు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కందుకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం ఈఈఈ, సివిల్ విభాగాల్లో మిగిలిపోయిన సీట్లును భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9505504201, 9985152442ను సంప్రదించాలని కోరారు.

నోట్‌బుక్స్ పంపిణీ

కందుకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు వైకాంట్ స్వచ్ఛంద సంస్థ ద్వారా శుక్రవారం నోట్‌బుక్స్, డ్రాయింగ్ బుక్స్ పలకలు పంపిణీ చేశారు. బెంగళూరు కేంద్రంగా నడుస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధిగా ఉన్న మదనగోపాలపురం పాఠశాల హెచ్ఎం రామయ్య ద్వారా వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కళ్లగుంట మోహనరావు, సంస్థ ప్రతినిధులు వనజ, బాలభాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

వలేటివారిపాలెం, జూలై 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న బీమా సౌకర్యాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని జమీన్‌ఉప్పలపాడులో శుక్రవారం పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవై, పీఎంజేడీవై బీమా సదుపాయాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఆ కార్యక్రమంలో మేనేజర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ బీమా సదుపాయం వలన తక్కువ ఖర్చుతో రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలు బీమా పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌ఆఫీసర్ రవికుమార్, రైతులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం, రూరల్ మండలంలో శనివారం విద్యుత్ సరపరాకు అంతరాయం ఏర్పడుతోందని 2వ పట్టణ ఏఈ వసంతరావు, రూరల్ ఏఈ శ్రీనివాసులురెడ్డిలు వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, విద్యుత్ లైన్ల వెంబడి ఉంటున్న చెట్ల కొమ్మలు కొట్టే కార్యక్రమం ఉన్నందున ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే విద్యుత్ సిబ్బంది కూడా ఎవరూ సెలవు పెట్టకూడదన్నారు.

● **కలిగిరి** : మండలంలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

● **అల్లూరు** : అల్లూరు, నార్తుమోపూరు సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ మస్తాన్ షరీఫ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అల్లూరు, నార్తుమోపూరు, బీరంగుంట, నార్తుఆములూరు, బట్రకాగొల్లు, గ్రద్దగుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

● **బిట్రగుంట** : బోగోలు మండలంలోని 4 విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, విద్యుత్ తీగల కింద చెట్ల కొమ్మలను తొలగించేందు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జడరాయ ఓ ప్రకటనలో తెలిపారు. చెంచులక్ష్మీపురం, జక్కేపల్లిగూడూరు, ముంగమూరు, వడ్డిపాలెంలో సబ్‌స్టేషన్లలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదాలు సహకరించాలని తెలిపారు.



రాళ్లపాడు ప్రాజెక్టు వంతెనపై గుంతలుపడి అధ్వానంగా మారిన రోడ్డు

రహదారుల సొగసు

చూడతరమా?

» అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు
» కల్వర్టుల వద్ద కోసుకుపోయిన మట్టి
» రోడ్లను కమ్మేస్తున్న ముళ్ల చెట్లు
» అడుగడుగున గుంతలతో నరకయతన
» ప్రయాణికులు, వాహనచోదకులకు తప్పని తిప్పలు



మట్టి మొత్తం కోసుకొని పోవడంతో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

గ్రామీణ ప్రాంతాలకు రహదారుల సౌకర్యం మెరుగ్గా ఉంటే ఆ గ్రామాలు అభివృద్ధి చెందుతున్నట్లే లెక్క. కానీ ఆ రహదారులు అడుగడుగున పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. రోడ్డు మార్జిన్లు అధ్వానంగా ఉన్నాయి. కల్వర్టుల వద్ద కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. రోడ్లకు ఇరువైపుల ఏపుగా పెరిగి రోడ్డును కమ్మేస్తున్న ముళ్ల చెట్లు ఇబ్బందిగా మారాయి. వంతెనల రక్షణ గోడలు ప్రమాద భరితంగా మారి రహదారుల సొగసు చూడతరమా? అన్న విధంగా దర్శనమిస్తున్నాయి. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. లింగసముద్రం మండలంలోని పలు రహదారులు ఇదే పరిస్థితిలో ఉండడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీంతో ప్రయాణికులు, వాహనచోదకులకు తిప్పలు తప్పడం లేదు.

- లింగసముద్రం (ఆంధ్రజ్యోతి)

లింగసముద్రం మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని మొగిచెర్ల వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉంది. సుమారు నాలుగైదేళ్ల క్రితం కందుకూరు ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ రోడ్డుపై ఒక లేయరు తారు రోడ్డు నిర్మించారు. ఆ సమయంలో ఇక్కడ కల్వర్టు వద్ద రోడ్డుపై గుంత ఏర్పడింది. అయినప్పటికీ అధికారులు ఈ గుంత మరమ్మతులకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో అప్పటి నుంచి వర్షం కురిసిన ప్రతిసారి ఈ రోడ్డుపై ఉన్న గుంత కాస్తా పెద్దదిగా మారుతోంది. ఈ క్రమంలో కొందరు వాహనదారులు ప్రమాదాలు జరగకుండా ఈ గుంత వద్ద ఓ పెద్ద బండరాయిని ఏర్పాటు చేశారు. అయితే కొద్ది రోజులకు ఆ బండ కూడా ఆ గుంతలోనే పడిపోయింది. మళ్లీ ఈ గుంత వద్ద ముళ్లకంప వేసి ప్రమాద సూచికంగా ఓ గుడ్డ ఏర్పాటు చేశారు. కానీ ఈ గుంత కూడా పెద్దది కావడంతో కల్వర్టు కింద ఉన్న మట్టి కూడా భారీగా కోతకు గురై ఈ రోడ్డు కాస్తా కల్వర్టు దిమ్మెలపై వేలాడుతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డుపై ప్రతి రోజూ కందుకూరు, కావలి ప్రాంతాల నుంచి బస్సులు, ఇతర వాహనాలు మొగిలిచెర్ల, పామూరు వెళుతుంటాయి. అలాగే ప్రతి శని, ఆదివారాల్లో వాహనదారులు మాల కొండ, మొగిలిచెర్లలోని దేవాలయాలకు భారీగా వెళుతుంటారు.



అధ్వానంగా లింగసముద్రం పాత చెరువు కట్ట రోడ్డు

● అధ్వానంగా రాళ్లపాడు ప్రాజెక్టు రోడ్డు

రాళ్లపాడు ప్రాజెక్టు వంతెన రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. ఏళ్ల తరబడి ఈ రోడ్డుపై గుంతలుపడి దారుణంగా ఉండడం, వర్షాలు కురిసిన ప్రతిసారీ రోడ్డుపై ఉన్న ఈ గుంతలు పెద్దవి అవుతున్నాయి. దీంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది ప్రతినిత్యం విధుల నిర్వహణకు ఈ రోడ్డు మీదుగానే ప్రాజెక్టు వద్దకు ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే ఇక్కడ జరిగే సభలు, సమావేశాలకు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా అప్పుడప్పుడు వస్తుంటారు. అదేవిధంగా ఈ రోడ్డు మీదుగా కొండాపురం, కలిగిరి, నెల్లూరు, చెన్నైకు, అలాగే శాయిపేట, పెదపవని మీదుగా కావలి, నెల్లూరుకు వాహనాలు తిరుగుతుం టాయి. ఈ రోడ్డుపైనే ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మాలకొండ, దత్తాత్రేయస్వామి ఆలయాలకు వెళ్లాలి. ఇంతటి ప్రాముఖ్యతున్న ఈ ప్రాజెక్టు వంతెన రోడ్డును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

● దుస్థితిలో పాత చెరువు కట్ట రోడ్డు

లింగసముద్రంలోని పాత చెరువు కట్ట రోడ్డు ఏళ్లతరబడి అభివృద్ధికి నోచుకోక అడుగుకో గుంత ఏర్పడి దుస్థితికి చేరింది. ముఖ్యంగా వర్షాలు కురిసిన ప్రతిసారి ఈ గుంతల్లో నీరు నిలిచి గుంతలు పెద్దవై అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెం, మాలకొండరాయునిపాలెం, విశ్వనాథపురం, వీఆర్ కోట తదితర గ్రామాల ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు, నిత్యావసర సరుకులకు ప్రతినిత్యం లింగసముద్రం రాకపోకలు సాగిస్తుంటారు. అంతేగాక వ్యవసాయ పనులకు తిమ్మారెడ్డిపాలెం, లింగసముద్రం గ్రామాల ప్రజలు ఈ రోడ్డును ఉపయోగిస్తారు. ఈ రోడ్డు అభివృద్ధిపై చర్యలు తీసుకునే నాథుడు కరవయ్యాడని స్థానికులు విమర్శిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు

● 'సుపరిపాలన తొలి అడుగ'లో ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే చంద్రబాబునాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఉప్పుచెరువు కాలనీలో రాజరాజేశ్వరి గుడివద్ద నుంచి శుక్రవారం సాయంత్రం ప్రారంభించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, పువ్వాడి కోటయ్య, భవనాసి వెంకటేశ్వర్లు, వేముల ఫణీంద్ర, కందల వెంకటరావు, సుబ్బ రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన పురుషోత్తం, అమృతమ్మలు

సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభు త్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అందుకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంచు మల్లికార్జున, పాలేటి రవి, హరిబాబు, మంచాల మాలకొండ్రాయుడు, నవీన్, భరత్‌కుమార్, కామినేని అశోక్, మేకల అశోక్, కామినేని శ్రీదేవి, చొప్పర రాఘవులుపాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

వలేటివారిపాలెం మండలం కాకర్లపాలెంకు చెందిన వైసీపీ నాయకులు బెజవాడ పురుషోత్తం, అమృతమ్మలు శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. కందుకూరులోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లబోతుల అంకయ్య, బోడ రమణయ్య, నల్లబోతుల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలుర హాస్టల్ తనిఖీ

పట్టణంలోని ఓవీ రోడ్డులో ఉన్న బీసీ బాలుర హాస్టల్‌ను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను, గదులను పరిశీలించిన ఆయన విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న భోజనం నాణ్యత, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని, భోజనం నాణ్యత మెనూ అమలులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించబోమని సిబ్బందికి సూచించారు.

● **వలేటివారిపాలెం** : మండలంలోని అయ్యవారిపల్లె, చుండి గ్రామాల్లో శుక్రవారం

గురుకులానికి నగదు వితరణ

బిట్రగుంట, జూలై 11(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల అవసరార్థం కోవూరుపల్లి వైద్యుడు రామకృష్ణ రూ.20 వేల శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం పాఠశాల్లో జరిగిన మెగా సమావేశానికి అతిథిగా వెళ్లిన తనకు విద్యార్థినుల క్రమశిక్షణకు నచ్చిందన్నారు. అయితే గురుకుల పాఠశాల్లో భోజనం తయారీకి వంటగ్యాసు సమస్య ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకుని తన సొంత నిధుల నుంచి ఆర్థిక సహాయం అందచేసినట్లు తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చి విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారులకు ఇబ్బంది కలుగ కూడదని తన వంతు సహాయం అందచేశానన్నారు.

వైభవంగా సాయిబాబా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో సాయినాథుడు

కలిగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయినాథుడికి కలిగిరి పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. విశేషపుష్పాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రజలు స్వామివారికి కాయకర్పూరం సమర్పించి ప్రసాదాలు స్వీకరించారు. స్వామి వెంట చిన్నారులు ప్రదర్శించిన కోలాటం అందరిని అలరించింది.

● **బిట్రగుంట:** బోగోలు రాజావీధిలో కొలువై ఉన్న షిరిడీ సాయినాథుడుకి గురుపౌర్ణమి సందర్భగా గురువారం అర్ధరాత్రి ప్రత్యేక పూల అలంకరణలో గ్రామోత్సవం వైభవంగా జరిగింది.



పురవీధుల్లో ఊరేగుంతున్న షిరిడీ సాయినాథుడు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

కావలి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పోరాటాల ద్వారానే సమస్యలు సరిష్కరించుకునేందుకు పోరాటాలకు ఆశా వర్కర్లు సిద్ధంగా ఉండాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణమ్మ పిలుపునిచ్చారు. సీఐటీయూ అనుబంధ సంస్థ ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ కావలి పట్టణ మూడవ మహాసభ శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వసుంధర అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ ఆశావర్కర్ల యూనియన్ ఏర్పడి 20ఏళ్లు పూర్తి అయిందని, అప్పటి నుంచి వారి సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నామన్నారు. పాలకులు వారికి తక్కువ జీతాలు ఇచ్చి ఎక్కువ పనులు చేయించుకుంటున్నారన్నారు. కనీస వేతనాలు కూడా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పీ.పెంచలయ్య, వసుంధరదేవి, ఎస్.గాయిత్రీలు మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పీ.పెంచలయ్య, అధ్యక్షురాలిగా ఎస్.గాయిత్రీ, ప్రధాన కార్యదర్శిగా టీ.వసుంధరాదేవి, సహాయకార్యదర్శిగా గిరీశమ్మ, పలువురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

వర్మికంపోస్టు ఎరువు విక్రయం



వర్మికం పోస్టు ఎరువును రైతుకు అందచేస్తున్న సర్పంచు నాగలక్ష్మి, డీఎల్‌పీవో కృష్ణమోహన్

ఉలవపాడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఉలవపాడు పంచాయతీ ఆధ్వర్యంలో చెత్త నుంచి తయారు చేసిన వర్మికంపోస్టు ఎరువును శుక్రవారం మామిడి రైతుకు విక్రయించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో రెండు నెలలపాటు చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియ చేసి 1000 కిలోలు సహసిద్ధమైన సేంద్రియ ఎరువును తయారు చేసినట్లు కందుకూరు డీఎల్‌పీవో కృష్ణమోహన్ తెలిపారు. ఒక కిలో మోతాదు ఎరువు ధర రూ.8 చొప్పున విక్రయించినట్లు చెప్పారు. గ్రామంలో గృహాలు, కూరగాయలు, పండ్ల షాపుల నుంచి సేకరించిన తడి చెత్తను 6, 7 వారాలు నాడెప్ తొట్టెల్లో కుళ్లపెట్టి అనంతరం ఆరుబయట ఆరపెట్టి వ్యర్థాలను తొలగించి వానపాములు ఉన్న తొట్టెల్లో సుమా రు 50 రోజులు ఉంచడం వలన ఏర్పడిన ఎరువును ఫిల్టర్ చేసి సంచుల్లో భద్రపరుస్తున్నామని వివరించారు. నిరంతరం ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి వీరయ్య తెలిపారు. సేంద్రియ ఎరువు మామిడి చెట్లకు చేసే మేలు తెలిసి కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చానని రైతు శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు నాగలక్ష్మి, ఎంపీడీవో సురేష్, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు, సచివాలయం కార్యదర్శులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గుట్టు తేలుద్దాం!

(5వ పేజీ తరువాయి)

నడుపుతూ నకిలీ మద్యం వ్యాపారం చేస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. దీంతో ఆయన్ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. ఈ క్రమంలోనే గుడ్లూరులోని ఆయన ఇంట్లో సోదాలు చేయగా భారీగా ఖాళీ డబ్బాలు, మద్యం సీసాలు దొరికాయి. నకిలీ మద్యం తయారీలో కలిపే 400 లీటర్ల రెక్టిఫైడ్ స్పిరిట్‌ను, సీలింగ్ స్టిక్కర్లు, సీలింగ్ మిషన్, ఖాళీ సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

● జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు

గుడ్లూరు ప్రాంతంలో నకిలీ మద్యం పట్టుబడిన తర్వాత జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేస్తున్నారు. వైన్‌షాపులు, బార్లు, ఆర్టీసీ బస్టాండ్లలోని కార్గో పాయింట్లు, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు సర్వీస్ పాయింట్లు తదితర ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. రికార్డులను పరిశీలించడం, ఏ సరుకు ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్లిందనే కోణంలో ఆరా తీస్తున్నారు.

నకిలీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

నకిలీ మద్యం తయారీ, విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాము. గుడ్లూరులో నకిలీ మద్యం పట్టుకున్న తర్వాత జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేస్తున్నాము. ప్రభుత్వ అనుమతులు పొందిన వైన్ షాపులు, బార్లలో మాత్రమే మద్యం కొనుగోలు చేయాలి. బయట ప్రాంతాల్లో మద్యం కొనుగోలు చేయవద్దు.

- దయాసాగర్, ఎక్సైజ్ డీసీ

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

(5వ పేజీ తరువాయి)

ఎరువుల దుకాణాలు గోదాముల్లో తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయాధికారి ఎస్‌కే జహీర్ మాట్లాడుతూ రైతులు తాము కొన్న ఎరువులకు తప్పనిసరిగా రశీదు అడిగి తీసుకోవాలన్నారు. అదేవిధంగా వ్యాపారులు కూడా ఎమ్మార్పీ కంటే అధిక ధరకు ఎరువులు విక్రయించకూడదని హెచ్చరించారు. సిద్దనకొండూరు పీఏసీఎస్‌లో యూరియా అందుబాటులో ఉందని, కలిగిరి, కుడుములదిన్నెపాడు పీఏసీఎస్‌లలో యూరియా తెప్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్లు, నోట్‌పుస్తకాల పంపిణీ

కందుకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓగూరు ఆదిఆంధ్ర కాలనీ ప్రాథమిక పాఠశాలలో మేక్ ఏ ఛేంజ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్లేట్లు, వాటర్‌బాటిల్స్, నోట్‌పుస్తకాలు, బోధనాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుబ్బారెడ్డి, సొసైటీ సభ్యులు రవ్వా శ్రీనివాసులు, ఇన్నమూరి శ్రీనివాసులు, కొత్త నరేంద్రకుమార్, మనోహర్, నూకతోటి మాలిరావు, హెచ్ఎం ఎస్కే ఆషా, సీఆర్‌పీ శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో న్యాయవాది దంపతులకు గాయాలు

కావలిరూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని ముసునూరు జాతీయ రహదారిపై పార్వతమ్మ గెస్టహౌస్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కావలి పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్‌పార్టీ కావలి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి చింతాల వెంకట్రావు దంపతులకు గాయాలయ్యాయి. స్థానికులు, బాధితుడి కథనం మేరకు.. కోర్టు పనుల నిమిత్తం వెంకట్రావు, వైద్య పరీక్షలు కోసం ఆయన భార్య పద్మావతిలు శుక్రవారం కారులో నెల్లూరుకు వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని కావలికి వస్తుండగా కొద్ది క్షణాల్లో ఇంటికి చేరుతారనుకొనే తరుణంలో మార్గమధ్యంలో స్థానిక పార్వతమ్మ గెస్టహౌస్ సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో న్యాయవాది వెంకట్రావుకు తీవ్రగాయాలు కాగా ఆయన భార్య పద్మావతికి స్వల్పగాయాలయ్యాయి. డ్రైవర్ శ్రీకాంత్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. కాగా డివైడర్ పైకి చేరిన కారు మధ్యలో ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

విద్యుత్ అదాలత్‌కు 7 అర్జీలు



అర్జీలు ఇస్తున్న వినియోగదారులు

కావలి, జూలై 11(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న విద్యుత్ డీఈ కార్యాలయంలో శుక్రవారం కావలి నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన విద్యుత్ అదాలత్‌కు 7 అర్జీలు వచ్చాయి. విద్యుత్ అదాలత్‌కు చైర్మన్‌గా విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థికసభ్యులుగా జీ.మధుకుమార్, స్వతంత్ర సభ్యులుగా విజయకుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వినియోగదారులనుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని చెప్పారు. అయితే అదాలత్‌కు వచ్చిన పలువురు వినియోగదారులు విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వద్దని, లోఓల్టేజీ సమస్య, తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం తదితర సమస్యలను అదాలత్‌దృష్టికి తీసుకెళ్లినా దానిపై స్పందించలేదు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ విజయన్, కావలి కార్యనిర్వహక ఇంజనీర్ బెనర్జీ, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రవికుమార్, ఏఈలు పాల్గొన్నారు.

విట్స్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

కావలిటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు (ఐసీసీఏఆర్ఈ 2025) శుక్రవారం ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరగనున్న ఈ సదస్సును అనంతపురం జెఎన్‌టీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య శివకుమార్ పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాబోవు రోజుల్లో సమాజానికి ఏఐ ఇతర సాంకేతిక రంగాలతో గల అవసరాలను తెలియజేస్తూ విట్స్ కళాశాల జరుగుతున్న ఈ అంతర్జాతీయ సదస్సు ఆయా రంగాల్లో పరిశోధకులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సదస్సు సమన్వయకర్త డాక్టర్ శృజన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ దేశంలోని వివిధ పేరొందిన కళాశాలల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు రావటం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, చైర్మన్ విద్యాధర్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 12 జూలై 2025

మార్గదర్శిగా కలెక్టర్



దత్తత తీసుకున్న కుటుంబాలతో కలెక్టర్ వెంకటేశ్వర్

● ఐదు బంగారు కుటుంబాల దత్తత

తిరుపతి(కలెక్టరేట్), జూలై 11(ఆంధ్రజ్యోతి): ఐదు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా కలెక్టర్ వెంకటేశ్వర్ 'మార్గదర్శి'గా మారారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమం కింద జిల్లాలో సామాజిక అభివృద్ధికి దోహదపడేలా, అందరికీ ఆదర్శప్రాయంగా మొదటగా ఐదు బంగారు కుటుంబాలను శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్ దత్తత తీసుకున్నారు. కలెక్టరేట్‌కు సమీపంలోని నక్కల కాలనీకి చెందిన నాలుగు, దామినేడుకు చెందిన ఓ కుటుంబాన్ని దత్తత తీసుకున్నారు. శుక్రవారం వారు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేందుకు, ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాల్లో పునాదులు ఏర్పడేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ కుటుంబాల సంక్షేమం కోసం వ్యక్తిగతంగానే కాకుండా జిల్లాలోని వివిధ సంక్షేమ శాఖల సహకారం, సమన్వయంతో సాయం అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమం జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులకు, సమాజ సేవకులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యతగా ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకుంటే గ్రామీణాభివృద్ధికి తోడ్పాటును అందిస్తుందని కలెక్టర్ తెలిపారు.

దత్తత తీసుకున్న కుటుంబాలు:
షికారీ కాలనీకి చెందిన సావిత్రమ్మ, వేదవల్లి, అంబికా, బలరాం, దామినేడుకు చెందిన విజయశాంతి కుటుంబాలు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ



రెండో శనివారం, ఆదివారం. ఈ రెండు రోజుల వరుస సెలవులతో గురువారం సాయంత్రం నుంచే తిరుమలకు భక్తుల రాక పెరిగింది. శుక్రవారం నాటికి రద్దీ మరింత పెరిగి.. స్వామి దర్శనం కోసం కిలోమీటర్ల కొద్దీ క్యూలలో భక్తులు వేచి ఉన్నారు. వీరికి దాదాపు 16 గంటల దర్శన సమయం పడుతోంది. ఇక, టైంస్లాట్ టోకెన్లు, టికెట్లు ఉన్న వారికీ మూడు నుంచి నాలుగు గంటల తర్వాతే స్వామి దర్శనం లభిస్తోంది. ఈ రద్దీ ప్రభావం గదులపైనా పడింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

రైతుల పక్షాన తాము నిలబడుతున్నామని, చంద్రబాబు ప్రభుత్వం వారిని మోసం చేస్తోందని వైసీపీ అధ్యక్షుడు జగన్ ప్రకటించడం, శుక్రవారం సాక్షి ప్రధాన పత్రికలో ఆయన కొన్ని ప్రశ్నల్ని అడగడంపై జిల్లా రైతుల్లో చర్చ నడుస్తోంది. చంద్రబాబు ప్రభుత్వం అడక్కముందే రైతులకు రూ.4 సబ్సిడీ ఇచ్చి ఆదుకుంటుంటే, ఐదేళ్లలో ఏనాడూ నయా పైసా ఇవ్వని జగన్ అబద్ధాలను వల్లె వేయడంపై అన్నదాతల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. జగన్ పలుకుల్లో వాస్తవాల గురించి చర్చించుకుంటే..

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఐదేళ్లలో మామిడి రైతులకు ఎంతిచ్చావ్ జగన్?



● గతేడాది రూ.29 ఇచ్చింది నువ్వా.. ఫ్యాక్టరీలా?
● గతేడాది 1.7 లక్షల టన్నుల దిగుబడితో డిమాండ్
● ఈసారి 5 లక్షల టన్నుల దిగుబడితో ధరల పతనం

జగన్: ఏటా మే 10-15 మధ్య తెరవాల్సిన పల్ప్ ఫ్యాక్టరీలు ఈ ఏడాది ఎందుకు ఆలస్యంగా తెరిచారు?

వాస్తవం: ఈసారి వర్షాలు అధికంగా పడడంతో కాయలు ఆలస్యంగా పక్వానికి వచ్చాయి. పక్వానికి రాని కాయల్లో తియ్యదనం ఉండదు. తియ్యదనం లేకుండా ఫ్యాక్టరీలు కొనుగోలు చేయవు. అందుకే జిల్లాలోని ఫ్యాక్టరీలు పక్వానికి వచ్చాక జూన్‌లో తెరచుకున్నాయి.

జగన్: మీ గల్లా ఫ్యాక్టరీ, శ్రీని ఫుడ్స్. ఇలా మీ వాళ్లకు మేలు చేయాలన్న ఉద్దేశంతోనే ఇదంతా చేయడం లేదంటారా?

వాస్తవం: అసలు ఈసారి శ్రీని ఫుడ్స్ ఫ్యాక్టరీ పనిచేయలేదు. గల్లా ఫ్యాక్టరీ జిల్లాలోనే అత్యధికంగా రైతులకు రూ.6 ఇస్తోంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డికి చెందిన పీఎల్ఆర్ ఫ్యాక్టరీ రూ.4 మాత్రమే ఇస్తోంది. అందులోనూ తమ పార్టీ సానుభూతిపరులైన రైతుల నుంచే కొంటున్నారు. ఇప్పటికి 8 వేల టన్నులే సేకరించారు. అలాగే వైసీపీ నాయకులు నిర్వహిస్తున్న ర్యాంపుల్లో రూ.2 మాత్రమే ఇస్తున్నారు.

జగన్: వైసీపీ పాలనలో మేం కిలోకు రూ.29 ఇస్తే.. ఇప్పుడు రూ.రెండున్నర నుంచి రూ.మూడు ఇస్తారా?

వాస్తవం: గతేడాది రూ.29 చొప్పున కొనుగోలు చేసింది ప్రభుత్వం కాదు, ఫ్యాక్టరీలు. అప్పుడు డిమాండ్ ఉండడంతో కొన్నారు. గతేడాది 1.7 లక్షల టన్నుల దిగుబడి మాత్రమే రావడంతో ఫ్యాక్టరీలు కొన్నాయి. ఈసారి చిత్తూరు జిల్లాలో మాత్రమే 5 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. ఇలాగే 2023లో అధిక దిగుబడి వచ్చి ధర పతనమైపోయింది.అప్పట్లో జగన్ ప్రభుత్వం రైతుల్ని ఆదుకోలేదు.

జగన్: ఇప్పటివరకు రూ.4 సబ్సిడీ ఎంత మంది రైతులకు అందించారు? రూ.8 చొప్పున ఎంత మందికి ఫ్యాక్టరీలు చెల్లించాయి?

వాస్తవం: ఇప్పటివరకు జిల్లాలో 40,977 మంది రైతుల నుంచి 2,85,695 టన్నుల మామిడిని కొనుగోలు చేశారు. ఇంకా సేకరణ జరుగుతోంది. రెండు వారాల్లో పూర్తవుతుంది. ఆయా ఫ్యాక్టరీల వద్ద ప్రభుత్వ ఉద్యోగుల బృందం రైతుల నుంచీ బ్యాంకు అకౌంట్ వంటి వివరాలు సేకరిస్తోంది. తాజాగా రూ.260 కోట్ల సబ్సిడీ విడుదల చేస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. రైతుల ఖాతాల్లో ఒకేసారి నిధులు జమ కానున్నాయి. జిల్లాలో ఫ్యాక్టరీలు కిలోకు రూ.6 అందిస్తున్నాయి. అక్కడక్కడ కొన్ని మాత్రమే రూ.5 ఇస్తున్నాయి. ప్రతీసారిలాగే ఒకేసారి బిల్లుల్ని రైతులకు అందిస్తాయి.

జగన్: ఇక్కడ రూ.12 మద్దతు ధర అమలు కావడం లేదు. అదే పొరుగు రాష్ట్రం కర్ణాటకలో కుమారస్వామి కేంద్రానికి లేఖ రాస్తే రూ.16 చొప్పున కొంటున్నారు.

వాస్తవం: కర్ణాటకలో రూ.16 చొప్పున కాయల్ని కొనడం లేదు. అది మద్దతు ధర మాత్రమే. అక్కడ అనేక ఆంక్షలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.4 ఇస్తున్నాయి. కర్ణాటకలో రైతుకు గరిష్ఠంగా రూ.40 వేలు అందితే, ఇక్కడ గరిష్ఠం లేదు. రూ.2 లక్షలు అందినవారూ ఉన్నారు.

'మఠం', కాలువ భూముల్లో నిర్మాణాలు

● తొలగింపజేసిన అధికారులు
● అక్రమ నిర్మాణాలు చేపడితే కేసులు పెడతామన్న కలెక్టర్
● అధికారులను అడ్డుకున్న ఆరుగురిపై క్రిమినల్ కేసులు

మితిమీరిన వేగం

● బైకును ఢీకొని బోల్తాపడిన మినీలారీ
● ద్విచక్ర వాహనదారుడి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

విద్యా సంస్థల ప్రాంగణాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై కొరడా

● విస్తృతంగా పోలీసుల తనిఖీలు

వివరాలు
6వ పేజీలో

డీటీ లేరని.. కౌన్సెలింగ్ ఆగుతుందా?

● ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల ఇక్కట్లు

శ్రీకాళహస్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఈఏపీ సెట్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు మూడు రోజుల గడువుంది. డీటీ లేరని శ్రీకాళహస్తిలో ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు జారీ చేయడంలేదు. అయన సెలవులో ఉన్నారని, తమ కౌన్సెలింగ్ తేది ఆగుతుందా అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. సమయానికి సర్టిఫికెట్లు పొందే విషయంలో టెన్షన్ పడుతున్నారు. ప్రస్తుతం ఈఏపీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఇంజనీరింగ్‌లో చేరేందుకు కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. దీనికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా జత చేయాలి. మరో మూడురోజులు మాత్రమే గడువు మిగిలి ఉంది. శ్రీకాళహస్తి తహసీల్దారు కార్యాలయంలో ఆదాయ ధ్రువీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్ చేతికి అందక కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు వాపోతున్నారు. ఈ నెల 4న దరఖాస్తు చేసుకున్న కొందరు శుక్రవారం నాటికి కూడా ఇన్‌కం సర్టిఫికెట్ రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దారు జనార్దన్‌రాజును వివరణ కోరగా, డీటీ జగన్ సెలవులో ఉండటంతో ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ల జారీలో కొంతజాప్యం జరిగిందన్నారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి అధికారిని నియమించకపోవడాన్ని ప్రస్తావించగా, డిజిటల్ కీ లాగిన్‌ను ఇన్‌ఛార్జి అధికారి తెరిచే అవకాశం లేకపోవడంతో బాధ్యతలు అప్పగించలేదన్నారు. అందరికీ సోమవారం ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బయోటెక్నాలజీతో జంతువులకు మెరుగైన ఆరోగ్యం

● వెటర్నరీ వర్సిటీతో ఎన్ఐఏబీ ఒప్పందం



ఎంవోయూ పత్రాలు చూపుతున్న వీసీ జేవీరమణ, ఎన్ఐఏబీ డైరెక్టర్ తారుశర్మ

తిరుపతిరూరల్, జూలై11(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, హైదరాబాద్‌కి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (ఎన్ఐఏబీ) సంస్థల మధ్య విద్య, పరిశోధనాంశాల్లో పరస్పర సహకారం కోసం అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈమేరకు శుక్రవారం వర్సిటీ పరిపాలనాభవనంలోని సమావేశ మందిరంలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, అధికారుల సమక్షంలో ఎన్ఐఏబీ డైరెక్టర్ డాక్టర్ జి.తారుశర్మ ఈ ఒప్పంద పత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జేవీ రమణ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న బయోటెక్నాలజీని ఉపయోగించుకుని జంతువుల ఆరోగ్యం, ఉత్పాదకత మెరుగుపరచుకోవడం, అధునాత పరిశోధనల కోసం ఈ ఎంవోయూను కుదుర్చుకున్నామన్నారు. రిజిస్ట్రార్ రవికుమార్, డీన్ వీరబ్రహ్మయ్య, డీఆర్ సీహెచ్ శ్రీలత, సీవోఈ చెంగల్వారాయులు, డెయిరీ డీన్ నాగేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు రాణీ ప్రమీల, శ్రీదేవి, సూర్యనారాయణ, సురేష్, ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు

తిరుపతి(క్రీడలు), జూలై 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అన్నమయ్య కూడలి సమీపంలోని గిరిజన భవన్‌లో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు 5వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు ఏపీ గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు రేఖారాణి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలలో ఉమ్మడి 13 జిల్లాల నుంచి అండర్ 11, 13, 15, 17లలో దాదాపు 250మంది బాలబాలికల ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇందులో గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 26నుంచి 29వరకు బిలాస్‌పూర్(చతీస్‌గఢ్)లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



యనమల రామకృష్ణుడు

తిరుమల, జూలై11(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ సహా పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, గుజరాత్ చీఫ్ సెక్రటరీ పంకజ్ కుమార్, తెలంగాణ జాయింట్ సెక్రటరీ కె శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ వీరిలో ఉన్నారు.

రుయాస్పత్రికి కందారపు రాజమ్మ కళ్లు దానం

తిరుపతి(వైద్యం), జూలై 11(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి తల్లి కందారపు రాజమ్మ(82) అనారోగ్యంతో స్విమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. ఆమె కళ్లను రుయాస్పత్రి కంటి నిధికి దానం చేసేందుకు మురళి ముందుకొచ్చారు. ఈ విషయాన్ని ఆస్పత్రి కంటి విభాగాధిపతి డాక్టర్ చలపతిరెడ్డి దృష్టికి తీసెకెళ్లడంతో టెక్నీషియన్ రమేష్. మృతురాలి కళ్లను సేకరించి కంటి నిధిలో భద్రపరిచారు. కంటి చూపులేని వారికి తన తల్లి కళ్లతో లోకంచూసే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చినట్లు మురళి తెలిపారు. రాజమ్మ కుటుంబీకులను రుయా సూపరింటెండెంట్ రాధ, వైద్యాధికారులు అభినందించారు.



తన తల్లి కళ్లను రుయాస్పత్రి కంటి నిధికి దానం చేస్తున్న కందారపు మురళి

సర్వ దర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.54 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,473

తలనీలాలు సమర్పించినవారు: 27,796



విద్యా సంస్థల ప్రాంగణాల్లో 'పొగాకు' విక్రయాలపై కొరడా

● విస్తృతంగా పోలీసుల తనిఖీలు ● ఇప్పటికి 56 కేసులు నమోదు



పొగాకు ఉత్పత్తులు తీసుకోబోమంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యాసంస్థల ప్రాంగణాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఇప్పటికి 56 కేసులు నమోదు చేశారు. విద్యాసంస్థలకు 200 మీటర్ల లోపు పొగాకు విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు చేసి ఒక్కో దుకాణాదారుడికి రూ.200 అపరాధ రుసుం విధించారు. మళ్ళీ విక్రయాలు జరిపితే నేరుగా కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. ఇకపై అన్ని మాల్స్ షాపులు, దుకాణాలు, ఇతర వాణిజ్య, వర్తక దుకాణాల్లోనూ ముమ్మరంగా తనిఖీలు చేసి పొగాకు ఉత్పత్తులు విక్రయాలు చేస్తున్న వారిపై మరిన్ని కేసులు నమోదు చేస్తామని తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం హెచ్చరించారు. దీనికి సంబంధించి ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోని దుకాణాలను తనిఖీ చేసి ప్రతి రోజు నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్'పై అవగాహన తరగతులు నిర్వహించారు. అంతకుముందు గోవిందరాజస్వామి ఆలయ ప్రాంగణంలో అన్ని దుకాణాలు తనిఖీ చేసి పొగాకు ఉత్పత్తులు విక్రయించే వాటికి అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీతో పాటు సీఐలు శ్రీనివాసులు, మురళీమోహన్, పోలీసులు పాల్గొన్నారు.

70 విద్యా సంస్థల్లో ఈగల్ టీమ్‌లు ఏర్పాటు

వారం రోజులుగా 70 విద్యాసంస్థల్లో ఈగల్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. మిగతా వాటిలోనూ ఏర్పాటు చేసే దిశగా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎనిమిది.. ఆపై తరగతులకు సంబంధించిన అన్ని విద్యాసంస్థల్లో ఈగల్ టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ భక్తవత్సలం చెప్పారు. ఈ టీమ్‌లో ప్రధానోపాధ్యాయుడు, కళాశాల ప్రిన్సిపల్ నామినేట్ చేసిన ఇద్దరు సీనియర్ అధ్యాపకులు కో ఆర్డినేటర్లుగా ఉంటారు. వారిలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వారికి ప్రాధాన్యమిస్తారు. ఇద్దరు విద్యార్థులు, మరో ఇద్దరు విద్యార్థినులు ఉంటారు. వీరు ఆయా విద్యాసంస్థల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు, వినియోగం, మత్తు పదార్థాలు, గంజాయి వినియోగం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇస్తారు. అంతే కాకుండా ప్రతి తరగతిలో విద్యార్థులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటారు.



దుకాణాల వద్ద తనిఖీలు



టమోటా లోడుతో బోల్తా పడిన వాహనం (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన మహబూబ్ బాషా

భాకరాపేట ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

● ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న మినీ లారీ ● ఒకరి దుర్మరణం.. ఇద్దరికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్లు ధర్మయ్య, హుస్సేన్

చంద్రగిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): టమోటా లోడ్‌తో వేగంగా వస్తున్న మినీ లారీ అదుపు తప్పి మోటారు సైకిల్‌ను ఢీకొని బోల్తాపడిన ఘటనలో ఒకరు దుర్మరణం చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చంద్రగిరి మండలం కళ్యాణి డ్యామ్ సమీపంలోని భాకరాపేట ఘాట్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. భాకరాపేట సమీపంలోని దీన్‌దార్‌పల్లెకు మహబూబ్ బాషా(58).. చంద్రగిరి మండలం కాశిపెంట్ల వద్ద హెరిటేజ్ ఫ్యాక్టరీలో వర్క్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన తన విధులు ముగించుకుని, స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కళ్యాణి డ్యామ్ సమీపానికి వచ్చే సరికి.. మదనపల్లె నుంచి టమోటా లోడ్తుతో అతివేగంగా వస్తున్న మినీలారీ ఈ ద్విచక్ర వాహనంపై దూసుకెళ్లి, రోడ్డు పక్కన కల్వర్టులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మహబూబ్‌బాషా అక్కడికక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్లు గుడివాకు చెందిన ధర్మయ్య, హుస్సేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చంద్రగిరి పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించిన ట్రాన్స్‌కో ఏఈ సరెండర్

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల ట్రాన్స్‌కో ఏఈగా పనిచేస్తున్న చలపతి విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో ఎస్ఈ కార్యాలయంలో సరెండర్ చేసినట్లు శ్రీకాళహస్తి ఏడీఈ సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏఈ చలపతి 33కేవీ ఫీడర్‌లో మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం వహించి వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ ఇవ్వలేదని తెలిపారు. వినియోగదారుల సమస్యలపై స్పందించకపోవడం, విద్యుత్ సరఫరాలో పలుమార్లు అంతరాయం చోటు చేసుకున్నా పట్టించుకోకపోవడంతో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అధికం కావడంతో ఎస్ఈ సురేంద్ర నాయుడి ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి మండల ఏఈగా విధుల నుంచి తప్పించి ఎస్ఈ కార్యాలయంలో రిపోర్టు చేయవలసిందిగా ఆదేశాలు వచ్చినట్లు ఏడీఈ తెలిపారు.

అంగన్వాడీ పుస్తకాల ఆవిష్కరణ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీల్లో ఆటపాటలతో పాటు పుస్తకాల ద్వారా విజ్ఞానం పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ 3నుంచి 6 వ సంవత్సరం వరకు పిల్లలకు అందజేసే పుస్తకాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఐసీడీఎస్ పీడీ వసంతాబాయి, అసిస్టెంట్ పీడీ వాసంతి తదితరులు పాల్గొన్నారు.






రూ.3 కోట్లతో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సీఐసీ కేంద్రం

ఐఐటీలో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్

● రోజుకు 20 టన్నులు ప్రాసెస్ చేసేలా యంత్రాల ఏర్పాటు

● రేపు రాష్ట్రమంత్రి భరత్‌తో కలిసి ప్రారంభించనున్న కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్

ఏర్పేడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్‌కు సంబంధించి ఏర్పాటైన కామన్ ఇంక్యుబేషన్ సెంటర్(సీఐసీ) ప్రారంభానికి సిద్ధంగా ఉంది. రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌తో కలిసి కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఆదివారం ఈ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. భారత ప్రభుత్వం ఈ కేంద్రాన్ని రూ.3కోట్లతో ఫుడ్‌ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖ, ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద అభివృద్ధి చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న 76 కేంద్రాల్లో తిరుపతిలో ఏర్పాటు అవుతున్న ఈ కేంద్రం ఒకటి. రూ.2,059 కోట్ల వ్యయంతో ఈకేంద్రాలను నిర్మిస్తున్నారు. ఈ కేంద్రాన్ని తిరుపతి ఐఐటీ రసాయనిక ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కేఎస్ఎం రాఘవరావు సమన్వయంతో ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మార్గదర్శనంలో అభివృద్ధి చేశారు. ఈ కేంద్రం ముఖ్యంగా పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ మీద దృష్టి సారించనుంది. ఒక రోజుకు 20 టన్నుల వరకు మామిడి, అంజీర్, జామ తదితర పండ్లను ప్రాసెస్ చేసి జ్యూస్, పల్ప్, జామ్, పికిల్స్ వంటివి తయారు చేస్తారు. ఈ కేంద్రం విద్యార్థులకు పరిశోధన కేంద్రంగా కూడా ఉపయోగపడుతుంది. ఎంఎస్, పీహెచ్‌డీ విద్యార్థులకు ఫుడ్ టెక్నాలజీలో ప్రాక్టికల్ శిక్షణ పొందడానికి మెరుగైన అవకాశం ఉంటుంది. ఈ సెంటర్‌లో తయారయ్యే ఉత్పత్తులు స్వస్థ అనే బ్రాండ్ ద్వారా మార్కెట్‌లోకి రానున్నాయి.



సీఐసీ కేంద్రంలో ఏర్పాటు చేసిన యంత్రాలు



కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రౌడీయిజంతో కుటుంబాలు ఛిద్రం: డీఎస్పీ

శ్రీకాళహస్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): అనాలోచితంగా అత్యుత్సాహంతో రౌడీయిజానికి పాల్పడితే వారి కుటుంబాలన్నీ తీవ్రంగా నష్టపోతాయని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చంచారు. ఇటీవల ప్రభుత్వాస్పత్రిలో రెండు వర్గాలు దాడులకు దిగిన ఘటన తెలిసిందే. దీనిపై రౌడీయిజాన్ని రూపుమాపాలన్న ధ్యేయంతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సబ్‌డివిజన్ పోలీసు యంత్రాంగం అంతా పట్టణంలో గురువారం రాత్రి కవాతు నిర్వహించి దాడి ఘటనలో పాత్రధారులైన వారి ఇళ్ల వద్దకు చేరుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాళహస్తిలో సరికొత్త ఆలోచనతో రౌడీయిజాన్ని తగ్గించాలని నిర్వహించిన పోలీసు కవాతుకు అన్ని వర్గాల ప్రజల నుంచి హర్షం వ్యక్తమైంది. ముందుగా డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బంది సమావేశమయ్యారు. పట్టణ ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహిస్తూ 1వ వార్డు వరకు చేరుకున్నారు. ఇటీవల దాడిలో పాల్గొన్న వారి ఇళ్ల వద్దకువెళ్లి మైకుల ద్వారా రౌడీయిజానికి పాల్పడితే ఆయా కుటుంబంలో పిల్లలు, మహిళలకు సమాజంలో గౌరవం లోపిస్తుందని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల నియామకానికి కూడా అవకాశం కోల్పోతారని తెలిపారు. రౌడీషీటర్‌గా నమోదైతే జరిగే నష్టాలను తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు సహకరించడం, మత్తు వ్యసనాలకు గురైతే ఎదురయ్యే అనర్థాలను వివరించారు. అక్కడి నుంచి పట్టణంలోని పలుప్రధాన వీధుల్లో కవాతుగా సాగుతూ మంచినీళ్ల గుంట ప్రాంతానికి చేరుకున్నారు. ఇక్కడ దాడి ఘటనలో ఉన్న వారి కుటుంబాలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐలు గోపి, తిమ్మయ్య, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

10 మంది హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి

తిరుపతి(నేరవిభాగం),జూలై 11(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న 10 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ఎస్పీ హర్షవర్ధనరాజు ఉత్తర్వులు జారీ చేశారు. వీరందరికీ శుక్రవారం పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇందులో సత్యనారాయణ సీఐడీ నుంచి ఇంకా రిలీవ్ కాలేదు. అలాగే సి.మురళిని తిరుమల టూ టౌన్ నుంచి తిరుపతి వెస్ట్‌కు, షేక్ జిలానీ ఫీర్‌ను రేణిగుంటకు, టి.గోపాల్‌ను అలిపిరి పీఎస్‌కు, ఎన్. శ్రీనివాసులును తిరుచానూరు నుంచి ఆర్‌సీ పురానికి, ఎన్. వెంకటేశ్వర రావును క్రైం స్టేషన్ నుంచి ఎంఆర్‌పల్లెకి, ఈశ్వర సింగ్‌ను శ్రీకాళహస్తి టూ టౌన్ నుంచి ఏర్పేడుకు, టి.సుబ్రమ్మణ్యం రెడ్డికి ఇంటెలిజెన్సు నుంచి రిలీవ్ అయి వచ్చిన తర్వాత పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఇక టి. పురుషోత్తమ ఆచ్చారిని క్రైం స్టేషన్ నుంచి చంద్రగిరికి, రాజగోపాల్ రెడ్డిని క్రైం స్టేషన్‌లో కోర్టు మానటరింగ్ విభాగం నుంచి రేణిగుంట విమానాశ్రయానికి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మఠం, కాలువ భూముల్లో నిర్మాణాలు

● అడ్డుకున్న అధికారులు ● ఆక్రమించి నిర్మిస్తే క్రిమినల్ కేసులు పెడతామన్న కలెక్టర్



మఠంభూమిలో నిర్మాణాల తొలగింపు తర్వాత అధికారులతో మాట్లాడుతున్న నిర్మాణదారులు

తిరుపతిరూరల్, జూలై11(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం అవిలాల పంచాయతీ సర్వేనంబర్లు 145, 147లోని వివాదాస్పద మఠం భూముల్లో చేపడుతున్న నిర్మాణాలను శుక్రవారం రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు అడ్డుకున్నారు. న్యాయస్థానంలో కేసు నడుస్తున్న (స్టేటస్ కో) ఈ భూముల్లో పరకాల మఠం ద్వారా పొందిన నరసింహారెడ్డి, అతడి మనుషులు నిర్మాణాలు చేపడుతున్నారన్న సమాచారంతో ఇటీవల హథీరాంజీమఠం అధికారులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలతో శుక్రవారం ఆర్డీవో రామ్మోహన్, ఎండోమెంట్ ఈవో బాపిరెడ్డి, డీఎస్పీ ప్రసాద్, రూరల్ తహసీల్దార్ రామాంజులనాయక్, రూరల్‌సీఐ చిన్నగోవిందు ఈ భూములను పరిశీలించారు. నిర్మాణాల తొలగింపునకు అధికారులు ప్రయత్నించగా నిర్మాణదారులు అడ్డుకున్నారు. 'సర్వేనంబరు 145, 147లో హథీరాంజీమఠం, పరకాల మఠానికి సంబంధించి వివాదం నడుస్తోంది. దీనిపై హైకోర్టు స్టేటస్ కో విధించింది. ఇందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు' అంటూ నరసింహారెడ్డి, అతని తరపు వ్యక్తులను పిలిపించి మాట్లాడారు. కోర్టు ఉత్తర్వులు ధిక్కరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మఠంభూమికి సమీపంలోని అవిలాల గ్రామానికి సంబంధించి సర్వేనంబరు 146లో వాగుపోరంబోకు స్థలంలో చేపడుతున్న నిర్మాణాలను రూరల్ తహసీల్దార్ రామాంజులనాయక్ అడ్డుకున్నారు. ఇది కాలువభూమి కాదని, సర్వేనంబరు 147కి సంబంధించిన మఠంభూమి అని సేతుమాధవ్, మరికొందరు అడ్డుకున్నారు. ఈ భూమిని సర్వేచేశామని, సర్వేనంబరు 146కి సంబంధించి కాలువభూమిగా నిర్ధారణ అయిందని తహసీల్దార్ వివరించారు. దీనిపై ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని, ఎంతకూ స్పందించకపోవడంతో తొలగింపు చర్యలు చేపట్టామన్నారు. సర్వేకోసం రెండువారాల గడువు కావాలని సేతుమాధవ్ కోరగా, వారం రోజుల్లో సర్వే ప్రక్రియని పూర్తిచేయాలని తహసీల్దార్ సూచించారు. కాగా సర్వేసమయంలో ప్రైవేట్ సర్వేయర్‌తోపాటు డిస్ట్రిక్ట్ సర్వేయర్‌ని కూడా పంపుతామని, కాలువభూమిగా నిర్ధారణ అయిన వెంటనే నిర్మాణాలు తొలగిస్తామని సూచించారు. ఎండోమెంట్‌భూములు, కాలువపోరంబోకు భూముల ఆక్రమణలపై ఆయా విభాగ అధికారులు స్పందించారు. ఈవివాదంపై కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించారు. మఠంభూమి, ప్రభుత్వభూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హైకోర్టు స్టే విధించినా మఠంభూములను ఆక్రమించడం, నిర్మాణాలు చేపట్టడం వంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



నిర్మాణదారులతో మాట్లడుతున్న ఎండోమెంట్ ఈవో బాపిరెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, డీఎస్పీ ప్రసాద్

ఆక్రమణల తొలగింపును అడ్డుకున్న ఆరుగురిపై క్రిమినల్ కేసులు

తిరుపతి (నేరవిభాగం), జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు, తొలగింపు సందర్భంగా రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించడం, బెదిరింపులకు పాల్పడిన ఘటనలో ఆరుగురిపై క్రిమినల్ కేసు నమోదైంది. తిరుపతి రూరల్ తహసీల్దారు బి.రామాంజులునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎంఆర్‌పల్లె పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అవిలాలలోని, లింగేశ్వరనగర్‌లో సర్వేనెంబరు 146లో శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో రెవెన్యూ, పోలీస్ బలగాలు కలసి అక్రమ ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా దండు కామేశ్వరి, ఎన్.యశోద, సి.బాలాజీ, పి.సేతుమాధవ్, పి.మోహన్, ఐ.సాయిచరణ్ అధికారులను అడ్డుకున్నారు, దురుసుగా ప్రవర్తించారు, బెదిరింపులకు పాల్పడ్డారు. రెవెన్యూ శాఖ ఉపయోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను బలవంతంగా నిలిపి వేయించారు. ప్రభుత్వ భూమిపై తమ అధికారం చూపుతూ, రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించడంతో తహసీల్దారు ఎంఆర్‌పల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పలు సెక్షన్ల కింద ఈ ఆరుగురిపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

మాజీ సర్పంచు ఏడుకొండలు మృతి



ఏడుకొండలు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల తదితరులు

పెళ్లకూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పెన్నేపల్లి మాజీ సర్పంచు, టీడీపీ నాయకుడు కోవూరు ఏడుకొండలు(47) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పెన్నేపల్లి గ్రామానికి చేరుకుని ఏడుకొండలు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులు పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, నాయకులు మదన్‌మోహన్ నాయుడు సిద్దులయ్య, పునబాక పోలయ్య, దామతోటి సుబ్రహ్మణ్యం, గుంటపూడి గురవయ్య, పరుశురామ్ తదితరులు ఏడుకొండలు మృతదేహానికి నివాళులర్పించారు.

ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగు కీలకం



నవధాన్యాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ షణ్ముకం

వాకాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగు కీలకమని, పూత దశలోనే వాటిని కలియదున్నితే భూమి సారవంతమై దిగుబడి పెరుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం అన్నారు. మండలంలోని వాకాడు సచివాలయం-1లో రైతులకు నవధాన్యాలపై శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. 200 మంది రైతులకు నవధాన్యాల కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఏడీపీఎం పట్టాభిరెడ్డి, మండల వ్యవసాయశాఖ అధికారిణి దీప, వ్యవసాయశాఖ సిబ్బంది నీలిమ, బాబాసాహెబ్, సత్యనారాయణ, షమీరా, గంగావేణు, తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

గూడూరు అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిపై అవగాహన పెంపొందించేందుకు విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించడంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి, సమాజంలో బాధ్యతను తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో శ్రీధర్, పద్మయ్య, రఘురామ్, భవానీ, సునీత, శ్రీలక్ష్మీ, భారతి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై విస్తృత ప్రచారం చేయాలి

కోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కుపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తహసీల్దారు జయజయరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ప్రతి బూత్‌లెవల్ అధికారి ఇంటింటా తిరిగి ఓటు నమోదు చేసే కార్యక్రమంలో తగు సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. కొత్త నిబంధనల ప్రకారం ఏడాది నాలుగు పర్యాయాలు ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. అదే విధంగా భవిష్యత్తు ఓటర్ల కింద 17 సంవత్సరాలు నిండిన యువతీ, యువకుల పేర్లను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. సమావేశంలో డీటీ అల్లం మల్లికార్జునరావు, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళతామని మున్సిపల్ కార్మికులు అన్నారు. శుక్రవారం పట్టణంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయాలన్నారు. కార్మికులు చనిపోతే దహన సంస్కారాలకు రూ.20 వేలు అందజేయాలని కోరారు. గతంలో 17రోజులు చేపట్టిన సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, వెంకటరమణయ్య, రాజేష్, బీవీ రమణయ్య, మణి, శ్రీనివాసులు, ఆనంద్, శివ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలు విధుల్లో జాగ్రత్త వహించాలి

బాలాయపల్లి, జూలై11(ఆంధ్రజ్యోతి) బీఎల్‌లోలు తమ విధుల్లో జాగ్రత్త వహించాలని తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని బీఎల్‌లోలకు వారి విధులపై ట్రైనర్ షాహిద్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ బీఎల్‌వోలు ఓటర్ల చేర్పులు, సవరణలు, షిఫ్ట్‌లు, తొలగింపులు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ సందీప్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ హుండీ లెక్కింపు

నాయుడుపేట టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ హుండీ నగదును శుక్రవారం లెక్కించారు. పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో విశ్రాంత బ్యాంక్ ఉద్యోగులు హుండీ నగదును లెక్కించారు. రెండు నెలల్లో రూ.3,36,238 ఆదాయం వచ్చినట్లు సుధీర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఈవో రవికృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు నానాబాల సుబ్బారావు, వినుగొండ ధనంజయ, దేవదాయ సిబ్బంది యుగంధర్, బాలాజీ పాల్గొన్నారు.



హుండీ నగదు లెక్కిస్తున్న విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు

విద్యుదాఘాతంతో ఉత్తరప్రదేశ్‌వాసి మృతి



మృతి చెందిన పాశ్వాన్

నాయుడుపేట టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఉత్తరప్రదేశ్‌వాసి పాశ్వాన్(27) మృతి చెందినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పాశ్వాన్ కొంత కాలంగా మేనకూరు పారిశ్రామికవాడలోని ఓ కర్మాగారంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం తన గదిలో ఇనుప కొక్కీకి దుస్తులు తగిలిస్తుండగా విద్యుదాఘాతం జరగడంతో పాశ్వాన్ అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. అతని సోదరుడు రోహిత్ హుటాహుటిన మేనకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా, అప్పటికే పాశ్వాన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మధురెడ్డి గిరిజనకాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు - నిరుపయోగంగా ఉన్న చేతిబోరు - దుస్థితిలో పక్కా గృహాలు

గిరిజన కాలనీలో మౌలిక వసతులేవీ?

గూడూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న మధురెడ్డి గిరిజనకాలనీలో మౌలిక వసతులు లేకపోవడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. గూడూరు నుంచి వేములపాళెం గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న కాలనీలో 43 కుటుంబాలు ఉన్నాయి. కాలనీలో ఉన్న రెండు వీధులు మట్టి రోడ్లే. గతంలో ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన పక్కా గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాకాలంలో ఇళ్లు ఉరుస్తుండడంతో పాటు వీధులు బురదమయంగా మారుతుండడంతో నానాపాట్లు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కాలనీలోని రెండు చేతి బోర్లలో ఉప్పునీళ్లు వస్తున్నాయని, కొళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగితే దూరప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో మౌలిక వసతులను మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం: విజయశ్రీ



భూపయ్యకాలనీలో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని భూపయ్య కాలనీ, బీడీకాలనీ, లోతువానిగుంట, పొగగొట్టంకాలనీ, పాత శివాలయంవీధి తదితర ప్రాంతాల్లో శుక్రవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే విజయశ్రీ ప్రతి ఇంటికీ వెళ్లి ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి పనులను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ముందుగా భూపయ్య కాలనీవాసులు కాలనీకి దారిని ఏర్పాటు చేయాలని, కొంతమందికి ఇళ్లు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు పరుస్తున్నారని అన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ అమలు చేశారని త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు పథకాలను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, గృహనిర్మాణశాఖ ఏఈ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు రఫీ, సుబ్బారావు, చిగురువాడ అశోక్‌కుమార్, ధనంజయ, నిత్యకృష్ణారెడ్డి, కట్టంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, జయరామయ్య, రేవతి తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: పాశం



తిప్పవరపాడులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం

గూడూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన, సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిప్పవరపాడు, కందలి గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసి అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి నడిపిస్తూ ప్రజల మన్ననలను పొందుతోందన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రూ.4వేలు చేసి ఇంటి వద్దకే అందిస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15వేలు అందజేయడం జరిగిందన్నారు. అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి రూ.5కే నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ పేదల ఆకలిని తీరుస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచితబస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించనున్నారన్నారు. సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. అనంతరం తిప్పవరపాడు గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, దుద్దా రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు, దామోదర్, అమరేంద్ర, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వాచ్‌మ్యాన్ మృతి

ఓజిలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం రాజుపాళెం గిరిజన కాలనీకి చెందిన మేకల మస్తానయ్య(50) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన సమాచారం మేరకు... మస్తానయ్య రాజుపాళెం సమీపంలోని ఓ ప్రైవేటు సంస్థలో వాచ్‌మ్యాన్‌గా పని చేస్తుంటాడు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన మస్తానయ్యను నెల్లూరులోని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వేగేటు ఉన్న చోటే అండర్ బ్రిడ్జి

సూళ్లూరుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ప్రస్తుతం రైల్వేగేటు ఉన్న చోటే అండర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని రైల్వే డివిజనల్ ఇంజినీర్ వికాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం అండర్ బ్రిడ్జి నిర్మాణంపై రైల్వే అధికారులు పట్టణవాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడతామన్నారు. ప్రజల విజ్ఞప్తుల మేరకు అండర్ బ్రిడ్జి గుండా అంబులెన్స్‌లు, ఆటోలు, మోటారు బైకులు వెళ్లేలా నిర్మాణం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీంద్రనాథ్ రెడ్డి, ఏడీఎం మోహన్, మురారికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా రామకృష్ణ



బాలాయపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డిప్యూటీ ఎంపీడీవో స్థానం ఖాళీగా ఉండడంతో కయ్యూరు పంచాయతీ కార్యదర్శి మోహన్‌రాజు డిప్యూటీ ఎంపీడీవోగా వ్యవహరిస్తున్నారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామకృష్ణ పదోన్నతిపై బాలాయపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా నియమితులయ్యారు.

నగల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



నాయుడుపేట టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నగల దుకాణాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ లీగల్ మెట్రాలజీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. దర్గా రోడ్డులోని ఓ దుకాణంలో తూకాలు, రికార్డులు, జీఎస్టీ బిల్లులు, బంగారు నిల్వలు, తదితర రికార్డులను విజిలెన్స్ అధికారులు తీసుకువెళ్లారు. ఏమైనా తేడాలు ఉంటే చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

వైభవంగా సీతారాముల శాంతి కల్యాణం

చిల్లకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): వల్లిపేడు గ్రామంలోని వల్లిపేటయ్య దేవస్థానం ప్రాంగణంలో సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సీతారాముల శాంతి కల్యాణమహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ, లావణ్య, మధుకిరణ్‌రెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో జిల్లా అర్చక కళామండలి సభ్యులు దీవి అనంతాచార్యులు వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యహవాచనం, రక్షిబంధనం, కన్యాదానం, మాంగళ్యధారణ, మాలమార్పిడి, తలంబ్రాల విశిష్ఠతను వివరిస్తూ కళ్యాణం జరిపించారు. లేబూరు సాయి బృందం నాదస్వర కచేరి, విద్వాన్ వరద వెంకటసుబ్రహ్మణ్యం అన్నమాచార్య కీర్తనలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో పీవీఎస్ నారాయణరావు, ముచ్చకాల నందకుమార్, సుర్తాని, మధుసూదన్, మహిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి టౌన్: పట్టణంలోని పాలకేంద్ర వద్ద 132కేవీ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతుల కారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెంకటగిరి విద్యుత్ శాఖ డీఈఈ మునిరవిచంద్ర శుక్రవారం తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాయుడుపేట: పట్టణంలోని అగ్రహారపేట, పిచ్చిరెడ్డితోపు, అమరా గార్డెన్, చంద్రమౌళినగర్, విజయగణపతి ఆలయం ప్రాంతం, టీచర్స్ కాలనీ, బాలాజీ గార్డెన్, గాంధీమందిరం, జైహింద్ కాలనీ, పొగగొట్టం కాలనీ, గరిడీవీధి, భూపయ్యకాలనీ, ఆవనీహోమ్, రాజగోపాలపురం, శ్రీరామ్‌నగర్, అశోక్‌నగర్, జువ్వలపాళెం, విన్నమాల తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శివశంకర్ తెలిపారు.

తడ: సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1.00గంట వరకు సరఫరా మండలంలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మురళి తెలిపారు.

కోట: మండలంలోని చెందోడు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కోట, వాకాడు మండలాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏడీఏ చిన్నయ్య తెలిపారు.

14 నుంచి ఎమ్మెల్యే పర్యటన

చిట్టమూరు, జులై 11(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఈనెల 14 నుంచి 18 వరకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మండలంలో పర్యటించనున్నట్లు టీడీపీ అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు తెలిపారు. 14న మెట్టు, ఉప్పలమర్తి, 15న మొలకలపూడి, చిల్లమూరు, 16న ఆరూరు, ఎల్లూరు, 17న పల్లంపర్తి, ముక్కిడిపాళెం, 18న అరవపాళెం, బురదగాలి కొత్తపాళెం గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ శర్మ, పక్కన ఈగల్ క్లబ్ నిర్వాహకుడు సుబ్రహ్మణ్యం తదితరులు

సూళ్లూరుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ అన్నారు. శుక్రవారం ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు

డక్కిలి, జులై 11 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ శివశంకర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన డక్కిలి - రాపూరు మార్గంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని, రెండోసారి పట్టుబడితే లైసెన్సు రద్దు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. హెల్మెట్ లేకపోయినా కేసులు పెడతామన్నారు. ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కోట, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని శ్యామసుందరపురం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు వండి పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

మంగళ, గురువారాల్లో పలు రైళ్ల రద్దు

తడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మార్గంలోని గుమ్మిడిపూడి కవరపేట రైల్వే స్టేషన్ల మధ్య ఇంజనీరింగ్, సిగ్నల్ వ్యవస్థ, పట్టాల మార్పిడి వంటి పనులు జరుగుతునందున మంగళవారం(15వ తేదీ), గురువారం(17వ తేదీ) పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు ప్రకటించారు.

రద్దు చేసిన రైళ్ల వివరాలు...

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 7.50 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66035.
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.20గంటలకు బయలుదేరి వచ్చే మెమూ రైలు నెంబరు 66036
- చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 5.40, 8.35, 10.15, మధ్యాహ్నం 12.10కు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు ఉదయం 10.00, 11.45, మధ్యాహ్నం 12.35, 1.15కు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెన్నై నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 8.05, 9.00, 9.30, 9.40, 10.30, 11.35, మధ్యాహ్నం 12.40కు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- గుమ్మిడిపూడి నుంచి చెన్నైకు ఉదయం 9.10, 9.55, 10.55, 11.25, మధ్యాహ్నం 12.00, 1.00, 2.30 వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- ఆవడి నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు ఉదయం 4.25కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లను రద్దు చేశారు.

అలాగే చెంగల్‌పట్టు, గుమ్మిడిపూడి, తాంబ్రం మధ్య నడిచే ఈఎంయూ లోకల్ రైళ్లు పాక్షికంగా రద్దు కాగా, మరి కొన్ని రైళ్లు చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి పొన్నేరి, మీజూరు వరకు నడపనున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు: కురుగొండ్ల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): వార్డులో సమస్యలన్నింటినీ విడతల వారీగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. శుక్రవారం పట్టణ పరిధిలోని 14వ వార్డు బొగ్గుల మిట్ట ప్రాంతంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వార్డు ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. వార్డులో తాగునీరు, డ్రైనేజ్ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన సమస్యలన్నింటినీ విడతల వారీగా పరిష్కరిచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, రాష్ట్ర పద్మశాలీయుల కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, మంకు ఆనంద్, పులికొల్లు రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాధ నాయుడు, రవి, చొప్పా వెంకటరమణ, మేరిగ రామకృష్ణ, తాండవ చంద్రారెడ్డి, గల్లా శ్రీనివాసులు, చెంగారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నంలో సుపరిపాలనలో తొలి అడుగు

కోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తిరుమూరు మురళి ఆధ్వర్యంలో కొత్తపట్నంలోని దళిత, గిరిజనవాడల్లో ఇంటింటా తిరిగి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుక్, జనసేన నాయకులు కావలి అశోక్, టీడీపీ నాయకులు శీనయ్య, చిరంజీవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలి

నాయుడుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ జేఎల్ఎం జీఆర్-2 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నాయుడుపేట విద్యుత్‌శాఖ కార్యాలయంలో శుక్రవారం ఈఈ శ్రీనివాసరావుకు ఎనర్జీ అసిస్టెంట్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎనర్జీ అసిస్టెంట్ల సంఘం నాయకుడు అశోక్‌రాజ్ మాట్లాడుతూ ఎనర్జీ అసిస్టెంట్లకు నూతన సర్వీస్ రూల్స్ రద్దుచేసి ఏపీఎస్ఈబీ రూల్ ప్రకారం ఏఎల్ఎంగా ప్రమోషన్ ఇచ్చి బదిలీలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సురేష్, రామస్వామి, గురవయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా నగరోత్సవం



సాయిబాబా నగరోత్సవాన్ని ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

నాయుడుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారపేటలో వెలసిన సాయిబాబా ఆలయంలో గురుపూర్ణిమ వేడుకలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి సాయిబాబాకు నగరోత్సవం నిర్వహించారు. బాబాను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పట్టణ పురవీధుల్లో మంగళ, వాయిద్యాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పూనాటి తిరుమల నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, పసుపులేటి రాజాబాబు, శ్రీధర్, చంద్రశేఖర్ రాయల్, ముత్యాలురెడ్డి, రామచంద్రారెడ్డి, మురళీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లుబాబు, సిద్ధయ్య, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

శాకాంబరి అలంకారంలో కోటమ్మ

కోట, జూలై 11(ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మను శాకాంబరిగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు చేసి పండ్లు, పూలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ - ఆటోలతో ఇంటింటా చెత్త సేకరణ

సూళ్లూరుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులకు గురై మూలకు చేరిన ఈ - ఆటోలను వినియోగంలోకి తెచ్చి ఇంటింటా చెత్తసేకరణకు శ్రీకారం చుట్టామని మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య తెలిపారు. కౌన్సిల్ ఆమోదంతో ఈ - ఆటోలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెచ్చామన్నారు. శుక్రవారం నుంచి పట్టణంలోని బాపూజీ కాలనీ, సోనియాగాంధీ నగర్, రాఘవయ్యపేట, పార్కువీధి, సాయినగర్ ప్రాంతాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు.